ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 21 ఫిబ్రవరి 2024



ఆళ్లతో.. జగన్ కాళ్ల బేరం



- ఇద్దరు ఎంపీలతో రాయబారం
- ఓటమి భయంతో సీఎం తత్తరపాటు
- నిన్న పనికిరాలేదు.. నేడు ఆయనే దిక్కని పిలుపు
- వైఎస్ షర్మిలతో ఆళ్ల చెలిమి మూణ్ణాళ్ల ముచ్చటే
- రామకృష్ణారెడ్డి రీ ఎంట్రీతో గంజికి చెక్ పెట్టినట్టేనా..

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఓటమి భయం వెంటాడుతుండటంతో ముఖ్యమంత్రి జగన్ అభ్యర్థుల ఎంపికలో తత్తర పాటుకు గురవుతున్నారు. సిట్టింగ్‌లను తారు మారు చేయటమో లేక తీసివేయటమో చేస్తే గెలుపు సాధ్యమవుతుందనే దింపుడు కల్లం ఆశతో వెనుకడుగులు వేస్తున్నారు. మంగళగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డికి తిరిగి సీటిస్తే గెలిచే అవకాశాల్లేవని తన సర్వేల ద్వారా తెలుసుకున్న జగన్ మంగళగిరికి గంజి చిరంజీవిని ఇన్‌చార్జిగా నియమించడం ద్వారా ఆళ్లకు పొగబెట్టారు. చిరంజీవి నియామకం రోజే ఆళ్ల ఎమ్మెల్యే పదవికి, వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి షర్మిలతో పాటు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఇకపై ఆమె వెంటే ఉంటానని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే మంగళగిరి నుంచైనా ఆ పార్టీ తరపున పోటీ చేసేందుకు సిద్ధమని ఆళ్ల ప్రకటించారు. దీంతో తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు పుట్టింది. మంగళగిరి నుంచి ఆళ్ళ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగితే ఆ నియోజకవర్గంలో వైసీపీ ఘోర పరాజయం ఖాయమని భావించారు. ఎలాగైనా టీడీపీ యువనేత లోకేశ్‌ను ఓడించాలని ఆశతో ఉన్న సీఎం జగన్ ఆళ్ల విషయంలో రాజీపడుతూ కాళ్ల బేరానికి దిగారు. ఎలాగైనా ఆళ్లను ఒప్పించి తిరిగి వైసీపీలోకి తీసుకొచ్చేందుకు ఇద్దరు ఎంపీలను రంగంలోకి దించారు. వారిలో ఒకరు స్వయానా ఆళ్ల సోదరుడు అయోధ్య రామిరెడ్డి కాగా రెండో ఎంపీ విజయసాయిరెడ్డి వీరిద్దరు కొద్ది రోజులుగా ఆళ్లను తరచుగా కలుస్తూ తిరిగి వైసీపీలో చేరాల్సిందిగా బతిమిలాడటం జరిగింది. ఆళ్ల కాంగ్రెస్‌లో చేరటం మూలంగా అన్న అయోధ్య రామిరెడ్డికి కూడా రాజకీయంగానే కాకుండా వ్యాపార వ్యవహారాల రీత్యా కూడా ఇబ్బందులు ఎదురవుతాయని భావించారు. దీంతో ఆయన కూడా ఆళ్లపై ఒత్తిడి పెంచారు. ఎంపీ విజయసాయిరెడ్డి కూడా ఇప్పటికే రెండు, మూడు సార్లు ఆళ్లను కలుసుకుని ఫోన్‌లో సీఎం జగన్‌తో మాట్లాడించినట్లు సమాచారం. ఎట్టకేలకు ఆయన్ను ఒప్పించి మంగళవారం సీఎంవోకు తోడ్కొని వెళ్లి జగన్‌తో కలిపారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆళ్లను రప్పించి చిరంజీవి ని ఇన్‌చార్జిగా నియమించటం తప్పేనని జగన్ ఒప్పుకున్నట్లు తెలిసింది. జగన్ సారీ చెప్పడంతో తిరిగి వైసీపీలో చేరేందుకు ఆళ్ల అంగీకరించారని తెలిసింది. వాస్తవానికి ఆళ్లకు బదులుగా నియమించిన చిరంజీవికి గెలుపు అవకాశాలు లేవని అధిష్ఠానం గ్రహించినట్లు సమాచారం. పైగా అందరినీ కలుపుకొని వెళడంలో కూడా చిరంజీవి విఫలమయ్యారని భావించటంతో తిరిగి ఆళ్లను దగ్గరకు తీసుకున్నారు. అయితే తిరిగి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి రామకృష్ణారెడ్డిని దించుతారో లేదనేది మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. కాగా ఆళ్లకే తిరిగి సీటు ఇస్తామని సీఎం హామీ ఇవ్వడం మూలంగానే వైసీపీలో చేరినట్లు ఆయన అనుయాయులు చెబుతున్నారు.





పన్ను వసూలు 35.80 శాతమే..

పన్ను వసూలుపై పర్యవేక్షణ కొరవడింది. లక్ష్యాల మేర పన్ను వసూలు జరగటం లేదు. వినుకొండ, అద్దంకి, దాచేపల్లి, మంగళగిరి, తాడేపల్లి మునిసిపాల్టీలు వసూలులో ముందుండగా చిలకలూరిపేట పురపాలక సంఘం చతికిలపడింది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపి వేస్తున్నారు. ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేకపోవటం వలనే ఈ ఆదాయాన్ని మునిసిపాలిటీలు రాబట్టుకోలేక పోతున్నాయి. మార్చి 31 నాటికిపురాల్లో మునిసిపాలిటీలు ఏ మేరకు పన్ను వసూలు చేస్తాయో చూడాలి.

- 40 రోజులు.. రూ 319 కోట్లు..
- పురాల్లో పన్ను వసూలు సాధ్యమేనా ?
- వసూళ్లపై ఎన్నికల ప్రభావం
- గత ఏడాది కంటే తగ్గిన వసూళ్లు
- బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం
- పన్ను వసూలు లక్ష్యం రూ.496.95 కోట్లు
- వసూలైన పన్ను రూ.177.92 కోట్లు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆదాయ వనరులను పెంపొందించుకోవటంలో మునిసిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఆస్తి, నీటిపన్ను బకాయిలు పేరుకుపోయాయి. ప్రకటనలు, తాత్కాలిక ఆక్రమణల పన్నులను భారీగా కోల్పోతున్నాయి. పన్ను వసూలుపై పర్యవేక్షణ కొరవడింది. లక్ష్యాల మేర పన్ను వసూలు జరగటం లేదు. ఆయా విభాగాల సిబ్బంది అలసత్వాన్ని ప్రదర్శిస్తుండటంతో పన్నుల వసూలు నత్తనడకన సాగుతోంది. ఆస్తి, నీటి పన్నులు పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో రూ.496.95 కోట్లు వసూలు చేయాలి. ఇప్పటి వరకు రూ.177.92 కోట్లు వసూలైంది. 35.80 శాతం మాత్రమే ఇప్పటికి పన్నులు వసూలు చేశారు. గత ఏడాది కంటే వసూలు గణనీయంగా తగ్గింది. ఎన్నికల ప్రభావం పన్ను వసూలుపై పడిందని అంచనా వేస్తున్నారు. వినుకొండ, అద్దంకి, దాచేపల్లి, మంగళగిరి, తాడేపల్లి మునిసిపాల్టీలు వసూలులో ముందుండగా చిలకలూరిపేట పురపాలక సంఘం చతికిలపడింది.

నీటిపన్ను వసూలు నామమాత్రం..

గుంటూరు కార్పొరేషన్ సహా మూడు జిల్లాల్లోని అన్ని మునిసిపాలిటీల్లో ఆస్తిపన్ను రూ. 408.42 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.160.25 కోట్లు వసూలైనట్టు డీఎంఏ కార్యాలయాల లెక్కలు తెలియజేస్తున్నాయి. వసూలు 29.23 శాతంగా ఉంది. నీటిపన్ను వసూలు నామమాత్రంగా ఉంది. తాగునీటి పన్ను రూ.88.53 కోట్లు వసూలు చేయాలి. ఇప్పటికి రూ.17.67 కోట్లు మాత్రమే పన్ను వసూలు చేయగలిగారు. నీటిపన్ను వసూలు 19.95 శాతంగా ఉంది. ట్రేడ్ లైసెన్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇతర అద్దెలు, వ్యాపార ప్రకటనలు తదితర ఆదాయం గణనీయంగా తగ్గింది. ఉన్నతాధికారులు ఏరోజుకారోజు పన్ను వసూలుపై సమీక్షిస్తున్నా మునిసిపాలిటీల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. దీని వల్లే పన్ను వసూలులో జాప్యం జరుగుతోంది. గుంటూరు కార్పొరేషన్‌లో దాదాపు రూ.15 కోట్లు ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోయాయి. సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఎఫ్‌సీఐ రూ.3.13 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అన్ని పురపాలక సంఘాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోయాయి.

ప్రణాళికా విభాగం పర్యవేక్షణ కరువు..

అభివృద్ధి పనుల నిర్వహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపులు పురపాలక సంఘాల్లో జాప్యం జరుగుతోంది. సకాలంలో పన్ను వసూలు కాకపోవటం వలనే ఈ పరిస్థితి నెలకొంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపి వేస్తున్నారు. ప్రకటనల పన్ను వసూలు కూడా ఆలస్యమవుతోంది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులకు, పన్ను వసూలుకు పొంతన లేదు. ప్రకటన పన్ను భారీగా పక్కదారి పడుతోంది. దీనిలో అధికారపార్టీ నేతలు పన్ను ఎగవేస్తున్నారు. తాత్కా లిక ఆక్రమణలు పన్ను వసూలు చేయడంలో సంబంధితులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రకటనలు, తాత్కాలిక ఆక్రమణల పన్నుల ఆదాయాన్ని పెంచుకోవటంలో మునిసిపల్ అధికారులు విఫలమవుతున్నారు. ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేకపోవటం వలనే ఈ ఆదాయాన్ని మునిసిపాలిటీలు రాబట్టుకోలేక పోతున్నాయి. పన్ను వసూలు వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా వారి మొర మునిసిపల్ అధికారులు ఆలకించే పరిస్థితి లేదు. మార్చి 31 నాటికి పురాల్లో ఆస్తి పన్ను రూ.248.17 కోట్లు, తాగునీటి పన్ను రూ.70.86 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. మునిసిపాలిటీలు ఏ మేరకు వసూలు చేస్తాయో చూడాలి.

మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా ..

మునిసిపాలిటీ	లక్ష్యం కోట్లలో	వసూలైన పన్ను కోట్లలో	శాతం
నరసరావుపేట	16.37	7.17	43.80
చిలకలూరిపేట	15.44	4.04	25.80
వినుకొండ	4.71	3.97	84.30
సత్తెనపల్లి	7.07	3.04	43.00
మాచర్ల	5.48	2.45	44.70
పిడుగురాళ్ళ	5.24	2.83	54.00
దాచేపల్లి	1.97	1.31	66.70
గురజాల	1.43	0.66	46.30
గుంటూరు	256.40	82.21	32.10
తెనాలి	24.61	12.32	50.10
మంగళగిరి, తాడేపల్లి	33.93	19.94	58.76
పొన్నూరు	5.61	3.10	55.20
బాపట్ల	8.98	4.21	46.90
రేపల్లె	5.24	2.91	55.60
చీరాల	11.38	6.95	61.10
అద్దంకి	4.16	3.18	76.40

తమ్ముళ్లలో.. జోష్



ఇంకొల్లులో జరిగిన 'రా..కదలిరా' సభకు హాజరైన జనసందోహాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు (పాతచిత్రం)

- టీడీపీలో కొత్త ఉత్సాహాన్ని నింపిన చంద్రబాబు 'రా.. కదలిరా' సభ
- అధినేత ప్రసంగంపై జిల్లా వ్యాప్తంగా నేటికీ ప్రజల్లో చర్చ
- వైసీపీ నేతల ఉలికిపాటు, విమర్శలను తిప్పికొట్టడానికి నానా తంటాలు
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభ విజయవంతంపై టీడీపీ శ్రేణుల ఆనందం

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలో రా.. కదలిరా సభ నిర్వహించి ఇప్పటికే నాలుగు రోజులు గడిచాయి. కానీ దాని తాలుకా ప్రకంపనలు ఇంకా వైసీపీ నేతలను వెంటాడుతుంటే... టీడీపీ శ్రేణులు మాత్రం మరింత ఉత్సాహంతో కదం తొక్కుతున్నాయి. చంద్రబాబు రా.. కదలిరా సభ అనంతరం మొత్తం మూడు అంశాలు చర్చకు నిలవడంతో తెలుగుతమ్ముళ్లలో ట్రిపుల్ జోష్ కనిపిస్తోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ నెల 17న పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఇంకొల్లులో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన రా.. కదలిరా సభ అటు పాలకపార్టీ నేతలను జనంలో దోషులుగా నిలబెట్టడం ఒక ఎత్తయితే ఆయన చేసిన విమర్శలు బలంగా ప్రజల్లోకి వెళ్లడంతో పెద్దఎత్తున చర్చ నేటికీ నడుస్తోంది. దీంతో అధికారపార్టీ నేతల్లో ఉలికిపాటు కనబడుతోంది. చంద్రబాబు పర్యటన ఖరారైన అయిదు రోజుల వ్యవధిలోనే ఏర్పాట్లు పూర్తిచేయడం ఒక ఎత్తయితే దానిని అడ్డుకోవడానికి ప్రభుత్వం శతవిధాల ప్రయత్నించి నప్పటికీ సభ విజయవంతమైన తీరు కూడా పాలకపార్టీని ఆలోచనలో పడేసింది. దీంతో చంద్రబాబు పర్యట నతో పై మూడు అంశాలపై జనాల్లో పెద్దఎత్తున చర్చ జరగ డంతో తెలుగు తమ్ముళ్ల ట్రిబుల్ జోష్‌తో ఉరకలెత్తుతున్నారు.

నాలుగు రోజులు గడచినా అదే చర్చ..

పాలకపార్టీ నేతలపై ప్రజల్లో నాలుగేళ్లుగా వేళ్లూనుకున్న అసహనాన్నే సభ సాక్షిగా టీడీపీ అధినేత చంద్రబాబు ఎండ గట్టడంతో అది జరిగి నాలుగు రోజులు దాటినా ఆయన లేవనెత్తిన అంశాలపై ఇంకా జనాల్లో చర్చ జరుగుతుందని రాజకీయ పండితులు అభిప్రాయ పడుతున్నారు. వైసీపీ నేతలు ప్రజలను ఏ విధంగా పీడిస్తున్నారనే అంశంతో పాటు, సహజవనరుల విధ్వంసం పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయమే చంద్రబాబు నోటి వెంట రావడంతో ఆ ప్రసంగం బాధితులకు స్వాంతన చేకూర్చిందనే మాటలు విని పిస్తున్నాయి.

సభను భగ్నం చేయాలనుకున్నప్పటికీ..

చంద్రబాబు రా.. కదలిరా సభను పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో ప్రకటించినప్పటి నుంచి ప్రభుత్వం కుట్రలకు తెరలేపిన సంగతి తెలిసిందే. దేవాదాయశాఖ అధికారుల ఫిర్యాదు పేరిట పోలీసులను రంగ ప్రవేశం చేయించి సభాస్థలి దగ్గర హడావిడి చేయడం మొదలుకుని ఆర్టీసీ స్థలానికి ఫెన్సింగ్ వేయించే దుష్ట పన్నాగాలు అనేకం పాలకపార్టీ చేయించింది. అన్నింటినీ ఛేదించుకుని సభ కోసం ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ, జనాన్ని రాకుండా చేయాలనే కుయుక్తులతో ట్రాఫిక్ విషయంలో నియంత్రణ పాటిం చకుండా ప్రభుత్వం కుట్ర పన్నింది. ఇన్ని చేసినప్పటికీ పెద ఎత్తున జనం సభకు హాజరుకావడం ఒక ఎత్తయితే, అడ్డంకులు సృష్టించినా సభ విజయవంతం అవడంతో శ్రేణుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అధికారపార్టీ మీద ఉన్న వ్యతిరేకతకు ఇదో స్పష్టమైన సూచికనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

అధినేత ప్రసంగంపై జిల్లా వ్యాప్తంగా చర్చ...

ఇంకొల్లు సభలో చంద్రబాబు ప్రసంగం ఆసాంతం సూటిగా, పదునైన విమర్శలతో సాగింది. ముఖ్యంగా బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు చేసిన దురాగతాలను ఎండగడుతున్నప్పుడు ప్రజల్లో పెద్ద ఎత్తున స్పందన రావడం గమనార్హం. పైగా ఆ వ్యాఖ్యల పట్ల నేటికీ జిల్లావ్యాప్తంగా జనంలో చర్చ నడుస్తూనే ఉంది. ఆమరావతిలో పెద్ద సైకో ఉంటే పర్చూరులో చిన్న సైకో ఉన్నారని వైసీపీ నేత ఆమంచిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకుని పాలకపార్టీ చేసిన ఓట్ల అక్రమాలను మరోసారి చంద్రబాబు ప్రజలకు వివరించారు. బాపట్ల ఎంపీ సురేష్‌కు కబ్జాలు, బెదిరింపులు, అక్రమాలు చేయడం తప్ప పార్లమెంటులో పొడిచిందేమి లేదని, చెరుకుతోటలు కాల్చడం తప్ప ఏదీ చేతకాదని విమర్శించారు. సంతనూతలపాడు వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అసెంబ్లీ వేదికగా ప్రకాశం జిల్లా కొండెపి టీడీపీ ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామిపై దాడికి వచ్చిన విధానాన్ని ఆ సభ వేదికగా మరోమారు టీడీపీ అధినేత గుర్తు చేశారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అధికారంలోకి వచ్చాక కమర్షి యల్ రఘుపతిగా మారిపోయారని ఎద్దేవా చేశారు. వేమూరు లో ఇసుక ద్వారా వంద కోట్లు వెనకేసిన మంత్రి ఇప్పుడు సంతనూతలపాడుకు వెళ్లారన్నారు. 2019లో టీడీపీ తరపున గెలిచి పార్టీమారిన దుర్మార్గుడు అని చీరాల శాసనసభ్యుడు బలరాంను ఉద్దేశించి అనగా, శాశ్వతంగా పేకాట ఆడుకోవడమేనని రేపల్లె వైసీపీ నేత, ఎంపీ మోపిదేవిని విమర్శించారు. ఇవే కాకుండా జిల్లాలో జరుగుతున్న అక్రమాలను, దుర్మార్గాలను, పడకేసిన అభివృద్ధి పనులను సభా వేదికగా ఎండగట్టారు.

వైసీపీ నేతల్లో ఉలికిపాటు...

అంచనాలకు మించి జనసందోహం కదలిరావడం ఒక ఎత్తయితే ఆయన చేసిన విమర్శల పట్ల జనాల్లో ఇంత పెద్దఎత్తున చర్చ జరగడం వైసీపీ నేతలకు మింగుడు పడడంలేదు. నష్ట నివారణ కోసం నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఆయన చేసిన ఆరోపణల పట్ల హుందాగా సమా .దానమివ్వాల్సిన నేతలు అదుపు తప్పి మాట్లాడుతున్నారనే వ్యాఖ్యలు ప్రజల నుంచే వ్యక్తమవుతున్నాయి. జరిగిన డ్యామే జీని కంట్రోల్ చేసుకునే నేపథ్యంలో ప్రజల్లో మరింత పలుచనవుతున్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన విమర్శల పట్ల తాజాగా పర్చూరు నియోజకవర్గంలో మంత్రి మేరుగ నాగార్జున స్పందించారు. ఎదురుదాడి తప్ప మరేమీ దానిలో కన్పించకపోవడం గమనార్హం. ఇక చీరాల శాసన సభ్యులు కరణం బలరాం కృష్ణమూర్తి కూడా చంద్రబాబు చేసిన విమర్శల పట్ల స్పందించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బలరాం చేసిన వ్యాఖ్యలు కూడా పూర్తిగా అదుపుతప్పి మాట్లాడినట్లుగా ఉంది తప్పితే మాజీ ముఖ్యమంత్రి చేసిన విమర్శలను తిప్పికొట్టడంలో విఫలమయ్యారనే చర్చ నడుస్తోంది. ఈ నేతలే కాకుండా జిల్లాలో ఉన్న మిగిలిన వైసీపీ నేతలు కూడా టీడీపీ అధినేత పర్యటన విజయవంతం కావడం, ఆయన చేసిన వ్యాఖ్యలు పట్ల కలవరపాటుకు గురవుతూనే ఉన్నారు.



పెనుమూడిలో నది ఒడ్డున పడవల్లో నుంచి ట్రాక్టర్‌లోకి ఎత్తుతున్న ఇసుక

డ్రెడ్జర్‌తో.. తవ్వకాలు

- పెనుమూడిలో ఇసుకాసురుల బరితెగింపు
- వారధికి ముప్పువాటిల్లే ప్రమాదమున్నా పట్టదు
- అడ్డగోలుగా అధికార పార్టీ నేతల ఇసుక దోపిడీ
- అధికారులు చోద్యం.. వందల ట్రక్కుల తరలింపు

రేపల్లె, ఫిబ్రవరి 20: అనుమతులు లేవు.. అధికారం అండతో.. రేపల్లె మండలం పెనుమూడి కృష్ణానదిలో ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. డ్రెడ్జర్ సహాయంతో ఇసుకను నదిలో నుంచి తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిని చూసి ప్రశ్నించిన గ్రామస్థులను సైతం బెదిరిస్తున్నారు. అయినా అధికారులు కళ్ళప్పగించి చూస్తున్నారే తప్ప కనీస చర్యలు తీసుకోవడంలేదు. అధికారం మాది చేతనైంది చేసుకోండి.. తవ్వకాలు మాత్రం ఆపేదిలేదన్న రీతిలో ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. రీచ్‌కు అనుమతులు లేకున్నా స్థానిక అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇసుకను ట్రాక్టరు టక్కుకు రూ.5 వేలు, 10 టైర్ల టిప్పర్‌కు రూ.30 వేలు వసూలు చేస్తున్నారు. వందలాది ట్రక్కుల ఇసుకను తోడేస్తూ ట్రాకర్లు, టిప్పర్ల ద్వారా తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. పెనుమూడి-పులిగడ్డ వారధి పక్కనే పెద్ద బోటుతో డ్రెడ్జర్‌ను ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఈ కారణంగా వారధికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తీరప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక ర్యాంప్ కాంట్రాక్టు తీసుకున్నామని చెబుతూ అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించిన దాఖలాలు లేవని పెనుమూడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుమూడి కరకట్ట వద్దే పోలీస్ చెక్‌పోస్టు ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉన్నతాధికారుల దృష్టిసారించి అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేసి వారధిని రక్షించాలని కోరుతున్నారు. ఇసుక కోసం వచ్చే భారీ వాహనాలతో కరకట్ట ఛిద్రమై ప్రమాదభరితంగా మారుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వారధి పక్కనే డ్రెడ్జర్ల ద్వారా ఇసుక తవ్వకాలు

ఫిల్మ్ అండ్ టెలివిజన్ సంస్థల్లో ప్రవేశానికి

జెట్



దిక్సూచి
DIKSUCHI

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ), కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్(ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ) ఉమ్మడిగా 'జాయింట్ ఎంట్రెన్స్ టెస్ట్(జెట్) 2023-24' నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి.

» **గ్రూప్-ఏ కోర్సులు(పీజీ డిప్లొమా)**

- రెండేళ్ల వ్యవధి గల ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా మేనేజ్‌మెంట్, మూడేళ్ల వ్యవధి గల ప్రొడక్షన్ ఫర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్, యానిమేషన్ సినిమా కోర్సులను ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ అందిస్తోంది. మూడేళ్ల వ్యవధి గల ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్, రెండేళ్ల వ్యవధి గల స్ర్కీన్ యాక్టింగ్, స్ర్కీన్ రైటింగ్(ఫిల్మ్, టీవీ, వెబ్ సిరీస్) కోర్సులను ఎఫ్‌టీఐఐ అందిస్తోంది.
- మూడేళ్ల వ్యవధి గల యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ డిజైన్ అనే యూజీ సర్టిఫికెట్ కోర్సు కూడా ఎఫ్‌టీఐఐలో ఉంది.

» **గ్రూప్-బీ కోర్సులు(పీజీ డిప్లొమా)**

- డైరెక్షన్ అండ్ స్ర్కీన్ ప్లే రైటింగ్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్ అండ్ డిజైన్ కోర్సులు రెండు ఇన్‌స్టిట్యూట్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. వీటితోపాటు గ్రూప్-ఏ విభాగంలోని ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్, స్ర్కీన్ యాక్టింగ్ కోర్సులను మాస్టర్స్ డిగ్రీకి సమానమైనవిగా ఏఐయూ గుర్తించింది.

» **గ్రూప్-సీ కోర్సులు**

- **పీజీ డిప్లొమా:** ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా మేనేజ్‌మెంట్‌కు సంబంధించి డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్, రైటింగ్ కోర్సులు ఉన్నాయి. ఒక్కోదాని వ్యవధి రెండేళ్లు. వీటిని ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ అందిస్తోంది.
- **పీజీ సర్టిఫికెట్:** డైరెక్షన్, ఎలక్ట్రానిక్ సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్ అండ్ టెలివిజన్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయి. ఒక్కోదాని వ్యవధి ఏడాది. ఇవి ఎఫ్‌టీఐఐలో అందుబాటులో ఉన్నాయి. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

అర్హత వివరాలు: పీజీ డిప్లొమా(ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్) కోర్సుకు డిగ్రీ(అప్లయిడ్ ఆర్ట్స్/ఆర్కిటెక్చర్/పెయింటింగ్/స్కల్ప్చర్/ఇంటీరియర్ డిజైన్) ఉత్తీర్ణులై ఉండాలి. యూజీ సర్టిఫికెట్(యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ డిజైన్) కోర్సుకు ఇంటర్/పన్నెండోతరగతి/ కనీసం రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. మిగిలిన కోర్సులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

జెట్ 2023-24 వివరాలు: మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం 3 గంటలు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్లో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో 20 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు; రెండో పార్ట్‌లో 20 మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలు అడుగుతారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. రెండో పేపర్ డిస్ర్కిప్టివ్ టైప్‌లో ఉంటుంది. దీనికి 60 మార్కులు ప్రత్యేకించారు.

- **దరఖాస్తు ఫీజు:** ఒక కోర్సుకు రూ.2,000 (రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.600); రెండు కోర్సులకు రూ.3000(రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.900); మూడు కోర్సులకు రూ.4,000(రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.1200)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 17
- **గ్రూప్-ఏ కోర్సులకు ఎగ్జామ్ తేదీ:** ఏప్రిల్ 6
- **గ్రూప్-బీ, గ్రూప్-సీ కోర్సులకు ఎగ్జామ్ తేదీ:** ఏప్రిల్ 7
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** ftii.ac.in, srfti.ac.in

ఐఐపీలో ప్యాకేజింగ్ డిప్లొమా

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని కరస్పాండెన్స్ విధానంలో నిర్వహిస్తారు. దీనికి ఏషియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు(ఏడాదిన్నర). అడ్మిషన్ తీసుకొన్న వారికి ప్యాకేజింగ్ టెక్నాలజీకి సంబంధించిన కోర్సు మెటీరియల్‌తోపాటు మోడల్ ప్రశ్నల బుక్‌లెట్‌ను ఇస్తారు. హైదరాబాద్, అహ్మదాబాద్, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతాల్లో ప్రాంతీయ కేంద్రాలు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్/కామర్స్/ఆర్ట్స్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు; గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు ప్రొడక్షన్, పర్చేజ్, మార్కెటింగ్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో కనీసం ఏడాది ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.77,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.iip-in.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/9pbkJMrలో చదవండి.

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ అండ్ కస్టమ్స్ రెగ్యులేషన్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇందులో 18 మాడ్యూల్స్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.35,400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 6
- **వెబ్‌సైట్:** iift.ac.in

ఐఐఐటీ అలహాబాద్‌లో ఎంబీఏ

అలహాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. సంస్థ నిర్వహించే మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(ఐమ్యాట్) లేదా జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా స్ర్కీనింగ్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు .

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **అడ్మిషన్ టెస్ట్ సెంటర్:** ఐఐఐటీ అలహాబాద్ క్యాంపస్
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **వెబ్‌సైట్:** www.iiita.ac.in

సైన్యానికి సెల్యూట్ చేసేలా ఉంటుంది

వరుణ్‌తేజ్



'కొత్త కథ చూపించాలనే ప్యాషన్‌తో 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం. ఈ సినిమా చూశాక ప్రేక్షకులు గర్వంగా, గుండెల నిండా దేశభక్తితో మన సైనికులకు సెల్యూట్ చేస్తారు' అని హీరో వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన హీరోగా శక్తి ప్రతాప్‌సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్ కథానాయిక. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం ఈ చిత్రం తెలుగు, హిందీ ట్రైలర్స్‌ను రామ్‌చరణ్, సల్మాన్‌ఖాన్ ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'తెలుగులో ఇదే తొలి ఏరియల్ వార్ డ్రామా. ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురి చేసేలా, అబ్బురపరిచే సన్నివేశాలు ఇందులో చాలా ఉన్నాయి. కచ్చితంగా ఈ సినిమా మిమ్మల్ని అలరిస్తుంది' అన్నారు. మానుషి చిల్లర్ మాట్లాడుతూ 'ఆపరేషన్ వాలెంటైన్ నాకు చాలా స్పెషల్ మూవీ. షూటింగ్‌లో వరుణ్‌తేజ్ సహకారం మరువలేనిది. నా డ్రీమ్ రోల్‌ను చేశాను' అని తెలిపారు. సమష్టి కృషికి రూపం ఈ సినిమా, యాక్షన్ డ్రామా, ఫన్ ఎమోషన్స్ లాంటి అన్ని ఎలిమెంట్స్ ఈ చిత్రంలో ఉన్నాయి అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాలో కీలకమైన పాత్ర చేశాను, విజువల్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటాయి అని నవదీప్ తెలిపారు.

వివి ఆనంద్‌తో అనిల్ సుంకర మరో చిత్రం



'ఊరు పేరు భైరవకోన' చిత్రంతో తాజాగా విజయం పొందిన దర్శకుడు విఐ ఆనంద్‌తో ఆ చిత్ర సమర్పకుడు, నిర్మాత అనిల్ సుంకర మరో సినిమా నిర్మించనున్నారు. ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు అభినందనలు తెలుపుతూ కొత్త చిత్రాన్ని అనౌన్స్ చేశారు అనిల్ సుంకర. 'విఐ ఆనంద్ సూపర్ నేచురల్ అడ్వెంచర్స్ చేయడంలో దిట్ట. కొత్త సినిమా కూడా కథ, సెటప్ పరంగా యూనిక్‌గా ఉంబోతోంది. ఇందులో హీరో, మిగిలిన వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి మాటలు: అబ్బూరి రవి, సహ నిర్మాతలు: రాజేశ్ దండా, అజయ్ సుంకర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిశోర్ గరికపాటి, నిర్మాతలు: అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర.

కమెడియన్ కాదు కామిక్ యాక్టర్



హీరో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రుతో కలసి నిర్మించిన చిత్రం 'సుందరం మాస్టర్'. హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. కల్యాణ్ సంతోష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలవుతోంది. చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "సుందరం మాస్టర్ ట్రైలర్ చాలా బావుంది. హర్షను కమెడియన్ అనడం నాకు నచ్చదు. ఆయనో కామిక్ యాక్టర్. ఆయన కామెడీ టైమింగ్ అద్భుతం. కొత్తవాళ్లను ప్రోత్సహిస్తున్న రవితేజకు అభినందనలు' అన్నారు. హర్ష మాట్లాడుతూ 'మా సినిమాకు చిరంజీవి గారు ఇచ్చిన మద్దతు మర్చిపోలేను. పదేళ్ల క్రితం ప్రేక్షకుల మధ్యలో ఉన్న నేను ఇప్పుడు ఇలా వేదికపై ఉన్నాను. మనం గట్టిగా అనుకుంటే ఏదైనా సాధించగలం' అన్నారు. ఈ సినిమా ఎంత పెద్ద హిట్ అవుతుందో తెలియదు కానీ మా అందరికీ గౌరవాన్ని తీసుకొస్తుంది అని దర్శకుడు చెప్పారు. హర్ష వల్లే మేం ఈ రోజు ఇక్కడ నిలబడగలిగాం, ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది అని సుధీర్ కుమార్ తెలిపారు.

గుర్తింపు కోసం ఎంతటి నీచానికైనా దిగజారుతారా?

త్రిష అసహనం



తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అన్నాడీఎంకే బహిష్కృత నేత ఏవీ రాజుపై హీరోయిన్ త్రిష మండిపడ్డారు. "గుర్తింపు కోసం ఎంతటి నీచానికైనా దిగజారిపోయే జీవితాలు కొందరివి... ఇలాంటి నీచమైన మనుషులను చూస్తుంటే చాలా అసహ్యంగా ఉంది. దీనిపై త్వరలోనే న్యాయపరంగా కఠిన చర్యలు కోరతాను" అంటూ ఆమె మంగళవారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇటీవల ఏవీ రాజు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఓ ఎమ్మెల్యే హీరోయిన్ త్రిషకు డబ్బులిచ్చి కూవత్తూరు పంచాయతీ లోని ఓ రిసార్ట్‌కు తీసుకొచ్చారని, ఈ విషయం నటుడు, మాజీ ఎమ్మెల్యే కరుణాస్‌కు తెలుసని అన్నారు. ఈ వ్యాఖ్యలు కోలీవుడ్‌లో దుమారం రేపుతున్నాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా త్రిషపై అసభ్యంగా మాట్లాడిన ఏవీ రాజును అరెస్టు చేయాలని నటుడు, దర్శకుడు చేరన్ డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా బహిరంగంగా సినీ పరిశ్రమలోని సభ్యులు కించపరిచేలా మాట్లాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి, ప్రధాన కార్యదర్శి బీఎన్ స్వామినాథన్ సంయుక్తంగా విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. -చెన్నై (ఆంధ్రజ్యోతి)

సవాల్‌గా స్వీకరించా



పలు తెలుగు చిత్రాల్లో బాల నటుడిగా అలరించిన దీపక్ సరోజ్ ఇప్పుడు 'సిద్ధార్థ్‌రాయ్' చిత్రంతో హీరోగా వెండితెర ఎంట్రీ ఇవ్వబోతున్నారు. యశస్వీ దర్శకత్వంలో ప్రదీప్ పూడి, జయ అడపాక, సుధాకర్ బోయిన నిర్మించారు. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా దీపక్ సరోజ్ మీడియాతో ముచ్చటించారు.

- బాల నటుడిగా 'మిణుగురులు' చిత్రంతో నంది పురస్కారం అందుకున్నాను. చదువు పూర్తి అయ్యాక యశస్వీ నన్ను కలసి 'సిద్ధార్థ్ రాయ్' కథ చెప్పారు. కథా నేపథ్యం విని షాక్ అయ్యాను. అసలు ఇలాంటి పాత్ర నేను చేయగలనా అనుకున్నాను. కానీ మా డైరెక్టర్‌ను నమ్మి ముందుకెళ్లాం.
- నాది రొటీన్ హీరోయిజం ఉన్న పాత్ర కాదు. తను చాలా లాజికల్‌గా ఆలోచిస్తాడు. పెద్దగా దేనికీ స్పందించడు. కానీ కొన్ని సందర్భాల్లో చాలా ఎమోషనల్ అవుతాడు. సవాల్‌గా స్వీకరించి ఈ పాత్ర చేశాను.
- 'అర్జున్‌రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో మా సినిమాకు పోలికలు లేవు. రెండు భిన్నమైన కథలు. గౌతమ బుద్ధుని తాత్వికత ప్రతిఫలించేలా ఉంటుంది కాబట్టి 'సిద్ధార్థ్‌రాయ్' అనే టైటిల్ పెట్టాం. హీరోగా మరో రెండు సినిమాలు చేస్తున్నాను.

మెప్పించే ముఖ్య గమనిక



విరాన్ ముత్తంశెట్టి, లావణ్య జంటగా నటించిన చిత్రం 'ముఖ్య గమనిక'. వేణు మురళీధర్ వి. దర్శకత్వంలో రాజశేఖర్, సాయికృష్ణ నిర్మించారు. ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన హీరో విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'కుటుంబ నేపథ్యాన్ని పక్కనపెట్టి తన కష్టంతో పైకి రావాలనుకుంటున్నాడు విరాన్. ఈ సినిమాతో ఆయన సక్సెస్ కొట్టాలి' అని ఆకాంక్షించారు. విరాన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. అల్లు అర్జున్ నాకు అందించిన సహకారం మరువలేనిది' అన్నారు. వేణు మురళీధర్ మాట్లాడుతూ 'విరాన్, లావణ్య జంట ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ. కిరణ్ సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది' అని చెప్పారు.

ఉత్కంఠ పెంచి వినోదం పంచేలా



అర్జున్ కల్యాణ్, కుషిత్ కల్లపు హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'బాబు నంబర్ వన్ బుల్‌షిట్ గై'. లక్ష్మణవర్మ దర్శకత్వంలో దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మించారు. మార్చి 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అర్జున్ కల్యాణ్ మాట్లాడుతూ 'హీరోగా నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమిది. థ్రిల్లర్, డ్రామా ఉన్న కథతో మూడు భాషల్లో తెరకెక్కించాం' అని తెలిపారు. 'దిలీప్‌గారు రాజీ పడకుండా సినిమాను నిర్మించారు. ఉత్కంఠ కలిగించడంతో పాటు వినోదం పంచేలా ఉంటుంది. నటీనటులు, టీమ్ అంతా చాలా కష్టపడి ఒక మంచి సినిమాను రూపొందించాం. మా సినిమాను ఆదరించాలి' అని దర్శకుడు ప్రేక్షకులను కోరారు. కుటుంబంతో కలసి చూసేలా ఈ సినిమా ఉంటుందని కుషిత చెప్పారు. దర్శకుడు సాయిరాజేశ్, నిర్మాత ఎస్కేఎన్, వికేక్ కూచిబొట్ల ముఖ్య అతిథులుగా పాల్గొని సినిమా ఘనవిజయం అందుకోవాలని ఆకాంక్షించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/kamTld7 లో చదవండి.

ఇసుక తవ్వకాలకు అనుమతులేవీ?

● అడ్డుకున్న శ్రావణ్ కుమార్, టీడీపీ శ్రేణులు

తుళ్లూరు, ఫిబ్రవరి 20: మండలంలోని రాయపూడి రీచ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలను తాడికొండ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మంగళవారం అడ్డుకున్నారు. జీసీకేసీ సంస్థ గత నాలుగు రోజుల నుంచి రాయపూడి రీచ్‌లో ఇసుక తవ్వకాలను చేపట్టింది. టన్నుకు రూ.550 చొప్పున వసూలు చేస్తోంది. బోట్ మెన్ సొసైటీకి నీటిలో నుండి ఇసుకను తీసే పనులను కలెక్టర్ అప్పజెప్పినట్లు అనుమతి పత్రాలను నిర్వాహకులు చూపారు. అయితే ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తీయటంతో శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఇసుక తీత పనులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తీయటం నేరమని పేర్కొన్నారు. రాయపూడి రీచ్‌లో ఇసుక తీయటం నిషేధమని గతంలో నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్ పేర్కొందని, ప్రభుత్వానికి జరిమానా కూడా విధించిందన్నారు. అటువంటప్పుడు ఎలా తీస్తారని ప్రశ్నించారు. రీచ్‌లో ఉన్న వాహనాలను పొక్లెయిన్‌లను బయటకు పంపించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ధనేకుల వెంకటబ్బారావు, బోరుపాలెం రాయపూడి గ్రామాల టీడీపీ అధ్యక్షులు కట్టా నరసింహారావు, మూల్పూరి శ్రీనివాసరావు, నాయకులు కొమ్మినేని కోటేశ్వరావు, జమ్ముల అనిల్, దళిత నాయకులు డేవిడ్, చిలకా బసవయ్య, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రాయపూడి రీచ్‌లో ఇసుక తవ్వకాలపై సీఐతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్



ఇసుక తీత పనులు అడ్డుకోవటంతో రీచ్ నుంచి బయటకు వస్తున్న లారీలు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతి రాజధానిపై జగన్‌కు కక్ష


● 1526వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 20: రాజధాని అమరావతిని నాశనం చేయటమే సీఎం జగన్‌రెడ్డి ధ్యేయంగా పెట్టుకున్నాడని 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, జై అమరావతి అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనను మంగళవారం నాటికి 1526వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడారు. మూడు ముక్కల ఆట తప్పితే సీఎం జగన్‌రెడ్డికి ఏమీ తెలియదన్నారు. సొంత బాబాయినే చంపేస్తే చర్యలు లేవన్నారు. అటువంటప్పుడు రాష్ట్ర ప్రజలను ఎలా కాపాడతారని ప్రశ్నించారు. నేరచరిత్ర ఉన్నవారు ప్రజలకు సేవ చేయరన్నారు. వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా దాడులకు పాల్పడుతున్నారన్నారు. మీడియాపై దాడి చేయటం క్షమించరాని నేరమన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధాలను తెరమీదకు తేవటంతో అందరూ అసహ్యించుకుంటున్నారని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలుగించి, బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

కృష్ణమ్మను తోడేస్తున్నారు..!

● తంగెడ కృష్ణానది నుంచి ఇసుక అక్రమ తరలింపు

● గ్రామంలో ఎమ్మెల్యే కాసు వుండగానే అక్రమాలకు శ్రీకారం



తంగెడ సమీపంలోని కృష్ణానది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

దాచేపల్లి, ఫిబ్రవరి 20: దీపం వుండగానే నాలుగు రాళ్లు వెనకేసుకోమన్న సామెతను కొందరు వైసీపీ నేతలు తూచ తప్పకుండా పాటిస్తున్నారు. మరో నెలలో ఎన్నికలు వున్నా ఇప్పటిదాకా జేబులో డబ్బులు ఖర్చుచేశామే తప్ప మాకు పైసా కూడా లాభం లేదనే ఆవేదన మంగళవారం వైసీపీ నేతలు స్థానిక ముఖ్యనేత ఎదుట అసంతృప్తి వ్యక్తం చేశారు. దాచేపల్లి మండలం, తంగెడ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామస్థాయిలో వున్న చిన్న చిన్న విభేదాలను సర్దుబాటు చేసే సమయంలో కొందరు నేతలు ఐదేళ్లు గడుస్తున్నా తమకు ఎటువంటి ఆదాయం లేదని, ఇక ఎన్నికల్లో ఎలా పనిచేయాలని ముఖ్యనేతకు చెప్పడంతో సరే జరిగిందేమిటో జరిగింది.. అంటూ భరోసా ఇచ్చినట్లు సమాచారం. ఆ తరువాత కొద్దిసేపటికే కొందరు నేతలు ట్రాక్టర్లతో గ్రామ సమీపంలో వున్న కృష్ణానదిలోకి ప్రవేశించి ఇసుకను అక్రమంగా తరలించారు. కొన్ని ట్రక్కులు బయటకు వెళ్లిన తరువాత సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. అటవీ భూభాగం నుంచి రవాణాను అడ్డుకునేందుకు అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకోవడంతో ఇసుక అక్రమ తరలింపును నేతలు నిలిపివేశారు. దీంతో గ్రామస్తులు అటవీ, మైనింగ్ శాఖల అధికారులకు సమాచారం ఇచ్చి అక్రమ ఇసుక తరలింపును నిలిపివేయడంతో వైసీపీ నేతలు ఏమి చెయ్యాలో అర్థంకాక ప్రస్తుతానికి ఇసుక తరలింపును నిలిపివేశారు. మొన్న పిల్లుట్ల పెద్దచెరువులోను అక్రమ మట్టి తోలకాన్ని గ్రామస్తులు అడ్డుకోవడంతో అక్రమార్కులు వెనుదిరిగారు.

సహజ వనరుల సాధనకు కలిసి రావాలి

● డాక్టర్ కొల్లా రాజమోహన్



టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి పట్టాభికి వినతిపత్రం అందజేస్తున్న కొల్లా రాజమోహన్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి20: రాష్ట్ర ముగింట నుంచి సహజ వాయువు తరలిపోతోందని, న్యాయబద్ధమైన ధర కోసం రాష్ట్ర పాలకులు అడగడం లేదని, కేంద్రం కూడా పట్టించుకోవడం లేదని ఈ నేపథ్యంలో సహజ వనరుల సాధనకై ఐక్యంగా ఉద్యమించాలని కృష్ణా, గోదావరి బేసిన్ గ్యాస్ చమురు సాధన సమితి నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, పీవీ మల్లికార్జునరావు, అవధానుల హరి అన్నారు. ఈ మేరకు విజయవాడలో టీడీపీ సీనియర్ నాయకులు కొమ్మారెడ్డి పట్టాభి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావులకు వినతిపత్రాలను అందజేశారు. అనంతరం కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ 1983లో కృష్ణా-గోదావరి బేసిన్ ఏర్పాటైనప్పటి నుంచి ఇంతవరకు రాష్ట్ర సంపద రూ.60లక్షల కోట్లు తరలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సహజవనరులు అదే రాష్ట్రానికి చెందుతుందని మోదీ చెప్పి, ప్రధాని అయిన తరువాత సహజవనరులు కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి, కనీసం రాష్ట్రాలకు రావాల్సిన వాటాలు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. సహజ వనురుల లభ్యత, రాష్ట్రానికే కూర్చే సంపదపై యువత, విద్యావంతులకు సమావేశాలు నిర్వహించి చైతన్యం చేయడానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని కోరారు.

వలంటీర్‌కు వైసీపీ కండువా కప్పేశారు..!



వలంటీర్ గుర్రం తిరుమలరావుకు (వృత్తంలోని వ్యక్తి) వైసీపీ కండువా కప్పుతున్న ఎంపీలు విజయసాయి, మోపిదేవి

రేపల్లె, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఇన్నిరోజులు సేవముసుగులో వైసీపీకి పని చేస్తున్న కొంతమంది వలంటీర్లు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆ ముసుగు కూడా తొలగించి పూర్తిస్థాయి వైసీపీ కార్యకర్తలుగా మారిపోవడానికి సిద్ధపడ్డట్లు కనబడుతోంది. రేపల్లె నియోజకవర్గ పరిధిలోని నిజాంపట్నం మండలానికి చెందిన కొంతమంది నేతలు, కార్యకర్తలు ఎంపీ విజయసాయిరెడ్డి సమక్షంలో మంగళగిరిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీకండువా కప్పుకున్నారు. నిజాంపట్నం మండల పరిధిలోని బొర్రావారిపాలెం గ్రామంలో రెండోవార్డు వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుమలబాబుకి కూడా పనిలోపనిగా ఎంపీలు విజయసాయిరెడ్డి, మోపిదేవీలు వైసీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించేశారు. సదరు వ్యక్తి వలంటీర్ విధుల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించిన దాఖలాలు లేవు. దీంతో ఇక మీదట వైసీపీ వలంటీర్‌గా పూర్తిస్థాయిలో సేవలందించడానికి సిద్ధమయ్యారన్న మాట.

వలంటీర్లే తన సైన్యమంటూ...

ఇటీవల వలంటీర్లకు పురస్కారాల కార్యక్రమలో వలంటీర్లే తన సైన్యమంటూ సీఎం జగన్ బహిరంగం గానే ప్రకటించారు. మరోవైపు వలంటీర్లు ఓటర్లను ప్రభావితం చేస్తున్నారంటూ వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచడంతోపాటు ఎన్నికల ఘట్టం ముగిసేవరకు ప్రభుత్వ పథకాలలో వారి పాత్రను పరిమితం చేయాలనే డిమాండ్‌ను టీడీపీ చేస్తోంది. ఈ నేపథ్యంలో వలంటీర్‌కు ఏకంగా వైసీపీ కండువా కప్పి పార్టీలోకి తీసుకోవడంతో తెలుగుదేశం మండిపడుతోంది.

ఇక మిగిలింది ఎన్నికల సేవేనా...

ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో ప్రజలకు సేవచేయడానికే వలంటీర్లు ఉంటారని పలు వేదికల మీద ప్రభుత్వం చెప్పింది. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే వారితో పూర్తి స్థాయి లో ఎన్నికల సేవ చేయించుకోవడానికి వైసీపీ సిద్ధపడినట్లే కనబడుతోంది. ఈ క్రమంలో అవసరమైతే ప్రత్యక్షంగా వైసీపీ జెండా పట్టుకుని మరీ పనిచేసేలా వలంటీర్ల సైన్యాన్ని సన్నద్ధం చేస్తున్నారనే విమర్శను టీడీపీ నేతలు చేస్తున్నారు. వలంటీర్ల కదలికలపై నిఘా పెట్టడంతో పాటు ఆ ముసుగులో పార్టీ సేవచేస్తున్న కొంతమందిని విధుల్లో నుంచి తొలగించేలా ఈసీ ఆదేశాలివ్వాలనే డిమాండ్‌ను తెలుగుదేశం చేస్తోంది.



మాట్లాడుతున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

జగనే అసమర్థ పాలనతో రాష్ట్రం ఒట్టిపోయింది

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

చుండూరు, ఫిబ్రవరి 20: జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం ఒట్టిపోయింది, ఎప్పుడో ఒకసారి బటన్ నొక్కడం తప్ప అభివృద్ధి ఛాయలు రాష్ట్రంలో కనిపించడం లేదని మాజీమంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి మోదుకూరులో జనసేన పార్టీ కార్యాలయాన్ని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావుతో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆనందబాబు మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్ మోసపూరిత మాటలు నమ్మి రాష్ట్ర ప్రజలు ఓటు వేసి గెలిపిస్తే రాష్ట్రాన్ని నిలువునా దోపిడి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుని సైకో పాలనకు ముగింపు పలకాలని ఆనందబాబు కోరారు.గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలకు కష్టాలు, కన్నీరే మిగిల్చాడు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడుతుందని, ప్రజలకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. జనసేన పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆనందన్న గెలుపు కోసం ప్రతి కార్యకర్త తమ వంతు కృషి చేయాలని తెలిపారు. కాపు నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య, పోకల శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండలాధ్యక్షులు అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, జొన్నకూటి సాంబశివరావు, టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, ఆళ్ళ సుబ్బారెడ్డి, బాలకోటిరెడ్డి, గూడేటి ఎల్లారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, దేవిరెడ్డి నాగేశ్వరరావు, కొల్లి శ్రీనివాసరెడ్డి, కేలం శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, పోకల గోపి, విష్ణుమొలకల శ్రీనివాసరావు, ఆళ్ళ హరి, తదితరులు పాల్గొన్నారు.

మాకు రక్షణ కల్పించండి

● మా భర్తలపై హత్యాయత్నం కేసులు ఎత్తివేయాలి

● మంచికల్లు గ్రామ టీడీపీ మహిళలు వేడుకోలు




మాట్లాడుతున్న మంచికల్లు గ్రామ టీడీపీ మహిళా నేతలు

రెంటచింతల, ఫిబ్రవరి 20: తమ భర్తలపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని మంచికల్లు గ్రామం టీడీపీకి చెందిన మహిళలు వాపోయారు. రాత్రి సమయంలో ఫోన్ చేసి దూషిస్తున్నారని, పొలానికి వెళ్లకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మద్దిగపు పిచ్చిరెడ్డి భార్య రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం రెంటచింతల పోలీసు స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికి ఎన్నో సార్లు కేసులు నమోదు చేయడంతో ఇళ్ళొదిలి ఎక్కడో తల దాచుకుంటున్నారని, ఆర్థికంగా నష్టపోయామని అయినా అధికార పార్టీ వారికి కడుపు మంట చల్లారలేదన్నారు. ఈనెల 18న బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ పోస్టర్లను గృహాలకు అంటిస్తున్న సమయంలో రజక వర్గానికి చెందిన అక్కినపల్లి వాసుపై దాడి చేసి చావబాదారన్నారు. ఆ తరువాత మమ్మల్ని ఏకవచనంతో తిట్టడంతో జరిగిన గొడవలో ఈశ్వర రెడ్డికి స్వల్ప గాయలైతే టీడీపీకి చెందిన 9 మందిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారని ఇదేం న్యాయమంటూ ప్రశ్నించారు. పోలీసులు అధికారపక్షానికి కొమ్ముకాసి మాపై అక్రమ కేసులు బనాయిస్తే ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు. విలేకరుల సమావేశంలో గోగుల నాగలక్ష్మి, పల్లెర్ల సునీత, గోగుల వెంకమ్మ, కృష్ణవేణి, కవిత తదితరులున్నారు.

పార్టీ వీడిన వారితో జగన్ బతిమిలాట

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 20: పార్టీ వదిలిపోయిన వారిని బతిమాలి వెనక్కితెచ్చుకొనే దయనీయ స్థితికి వైసీపీ ముఖ్యమంత్రి జగన్ చేరారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. రెండునెలల క్రితం వైసీపీకి గుడ్‌బై చెప్పిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్లను బతిమాలి తిరిగి తెచ్చుకోవటమే అందుకు నిదర్శనం అన్నారు. ఎన్ని తిప్పలుపడినా మంగళగిరిలో లోకేశ్ విజయాన్ని, రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభంజనాన్ని అడ్డుకోవటం జగన్ తరం కాదన్నారు. అదే సమయంలో జగన్‌తో చేతులు కలిపి అమరావతి విధ్వంసంలో పావుగా పని చేసిన కరకట్ట కమల్‌హాసన్ వేషాలను కూడా ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వ అవినీతిని భయటపెడతానని, కోర్టుల్లో కేసులు వేస్తానని చెప్పిన వ్యక్తి ఇప్పుడు మళ్లీ లోకేశ్‌ను ఓడిస్తా, వైసీపీని గెలిపిస్తా అంటుంటే చూస్తున్న జనం నవ్వుకుంటున్నారని ప్రత్తిపాటి చురకలు వేశారు. టీడీపీ, జనసేన పొత్తులో ఇప్పటికీ చిచ్చు పెట్టడానికి వైసీపీ ప్రయత్నం చేస్తోందన్నారు.

జిల్లాస్థాయి అంపైర్లు, స్కోరర్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి20: ఉమ్మడి జిల్లాలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌ల కొరకు అంపైర్లు, స్కోరర్లకు ఈ నెల చివరివారంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్‌పీవీ రమణ మూర్తి, డి.రమేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై, 18-35 మధ్య వయస్సు కలిగిన పురుషులు, మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో నిర్వహించే అర్హత పరీక్షలకు పంపుతామని పేర్కొన్నారు. ఆసక్తి గల్గిన అభ్యర్థులు సంఘ కార్యాలయంలో ఈనెల 25వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 97042 53968 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుపై వైసీపీ ఫేక్‌బ్యాచ్ దుష్ప్రచారం

● సీఎం అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూపు అంటూ బ్రేకింగ్‌లు

● తానెవరి అపాయింట్‌మెంట్ అడగలేదని తీవ్రంగా ఖండించిన ఎంపీ

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో ఫేక్ పోస్టింగ్‌లు పెడుతూ వైసీపీ మైండ్‌గేమ్‌కు తెర లేపింది. సీఎం జగన్, ఆ పార్టీ అధిష్టానం వైఖరి నచ్చక ఎవరైతే రాజీనామా చేసి వెళ్లిపోయారో వారిని ఏదో ఒక విధంగా తిరిగి పార్టీలోకి రప్పించేందుకు అడ్డదారులు తొక్కుతోంది. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తిరిగి వైసీపీలో చేరిపోవడంతో మిగతా వారిపై ఫేక్ పోస్టింగ్‌లతో బాణాలు సంధిస్తోంది. తాజాగా మంగళవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు లక్ష్యంగా ఒక సామాజిక మాధ్యమంలో బ్రేకింగ్ పెట్టింది. ఇటీవలే ఎంపీ, వైసీపీకి రాజీనామా చేసిన శ్రీకృష్ణదేవరాయలు తిరిగి వైసీపీతో బంధం ఏర్పరుచుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని, అలానే సీఎం జగన్ కింద గుంటూరు పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి పనిచేసేందుకు నిర్ణయించుకొన్నారని పోస్టింగ్ పెట్టారు. దానికి సీఎం అపాయింట్‌మెంట్ కోసం నిరీక్షణ అంటూ హ్యాష్‌ట్యాగ్ చేశారు. అలానే శ్రీకృష్ణదేవరాయలు తండ్రి లావు రత్తయ్యతో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి టచ్‌లోకి వెళ్లారు. గుంటూరు పార్లమెంట్ సీటు పైన చర్చ జరుగుతుందని పోస్టింగ్ పెట్టారు. ఈ పోస్టింగ్‌లు చూసి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఒకింత విస్మయానికి గురయ్యారు. ఆయన ఎక్స్ వేదికగా వైసీపీ ఫేక్ పోస్టింగ్‌లకు గట్టి సమాధానం ఇచ్చారు. తాను ఎవరి అపాయింట్‌మెంట్ కోసం అడగడం, విజ్ఞప్తి, ఎదురుచూడటం లేదని స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్‌న్యూస్‌ల వలలో పడొద్దని తన అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

వైసీపీ పాలనలో పత్రికా స్వేచ్ఛ లేదు

గుంటూరు, ఫిబ్రవరి 20: వైసీపీ పాలనలో పత్రికా స్వేచ్ఛ లేకుండా పత్రిక కార్యాలయాలపై దాడులు జరగటం దుర్మార్గమైన చర్య అని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం ధారూనాయక్ అన్నారు. మొన్న అనంతపురం జిల్లాలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయడం వైసీపీ అరాచకానికి నిదర్శనం అన్నారు. ఆ ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే కర్నూలులో ఈనాడు కార్యాలయంపై పాణ్యం ఎమ్మెల్యే అనుచరులు దాడిచేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ ఘటనలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉన్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వం పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగిస్తూ వాళ్లకి రక్షణలేకుండా చేస్తోందన్నారు. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపితే నిజాయితీగా పనిచేసే పత్రికలపై వైకాపా రౌడీలు ఇలా దౌర్జన్యాలు చేయటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేయడమేనన్నారు. కర్నూల్‌లో ఈనాడు కార్యాలయంపై వైకాపా గుండాలు దాడిచేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడం దారుణం అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..? సైకో జగన్ పత్రికా రంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితులను ఆదుకోవాలని, ఈ రెండు ఘటనల్లో పాల్గొన్నవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక ఎజెండా పెట్టుకుని పత్రికలను అణిచివేయాలని చూస్తున్నా రన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ సైకో జగన్‌కి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఈ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ప్రజలు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తక్షణం కేంద్రం జోక్యం చేసుకుని రాష్ట్రపతి పాలన విధించాలని, అలాగే రానున్న ఎన్నికలను కేంద్ర బలగాల నేతృత్వంలో నిర్వహించాలన్నారు.

మార్చి 9న దివ్యాంగుల గర్జన

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ, పాల్గొన ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20: హక్కుల సాధనకై మార్చి 9న 'చలో అమరావతి వికలాంగుల గర్జన' నిర్వహిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చెప్పారు. మంగళవారం జేకేసీ కళాశాల రోడ్డులోని ఓ కళ్యాణ మండపంలో ఎమ్మార్పీఎస్ అనుబంధమైన వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలపై రూపొందించిన 32 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. వికలాంగుల పట్ల జగన్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. తెలంగాణాలో పెన్షన్ పెంచితే తప్ప మన రాష్ట్రంలో పెన్షన్ పెంచడం లేదని విమర్శించారు. వివాహ ప్రోత్సాహకంలో పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలనే నిబంధన ఎత్తివేయాలన్నారు. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు వారి మ్యానిఫెస్టోలో వికలాంగులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వికలాంగులు రోడ్లపైకి రాకముందే సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు చిన్న సుబ్బయ్య యాదవ్, అందె రాంబాబు, రమేష్, గంటేడి సుజాత, మల్లేశ్వరీ, గాలి మట్టి కిరణ్, పాపిరెడ్డి, శైలజ, మాధవి, రమణయ్య, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత సిగిరెట్లు స్వాధీనం

చేబ్రోలు, ఫిబ్రవరి20: చేబ్రోలులో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అనుమతిలేని సిగిరెట్లను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో రెవెన్యూ, పోలీసు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు కిరాణా షాపులో హానికరమైన 1290 ప్యాకెట్లలో రూ.1,14,500 లక్షల విలువైన సిగరెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు జర్నలిస్టుల నిరసన ర్యాలీ, మానవహారం

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి అనంతపురం ఫొటో జర్నలిస్టు కృష్ణపై వైసీపీ మూకలు చేసిన దాడికి నిరసనగా బుధవారం గుంటూరులో జర్నలిస్టులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఉదయం 10 గంటలకు నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహిస్తారు. అనంతరం ర్యాలీగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం సమర్పిస్తారని ఏపీయూడబ్ల్యూజే జిల్లా నేత మీరా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పురుగు మందు షాపులో విజిలెన్స్ తనిఖీలు

● రూ.1.47 లక్షల విలువైన పురుగు మందులు స్వాధీనం

అచ్చంపేట, ఫిబ్రవరి 20: మండల కేంద్రమైన అచ్చంపేటలోని శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ నందు అక్రమంగా నిల్వ ఉంచిన పురుగు మందులను విజిలెన్స్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో పురుగు మందు షాపులో తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు కాని, బిల్లులు కాని లేకుండా నిల్వ ఉంచిన 51 లీటర్ల పురుగు మందును, 15 లీటర్ల పెస్టిసైడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ రూ.1,47,111 ఉంటుందన్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అగ్రికల్చర్ అధికారి కె.రమణ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఏ రామచంద్రయ్య, వ్యవసాయ అధికారి పరమేశ్వరరావు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,50,758 టిక్కీల మిర్చివిక్రయానికి రాగా అందులో 1,41,015 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 1,05,655 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఇలా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	9600	18000
334	9000	20200	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు. 5	13500	18000	తేజ	8000	21000
273	13000	17000	బ్యాడిగి	10500	20000
341	10000	21000	దేవనూరుడీలక్స్	11000	21000
4884	14500	18000	తెల్లకాయలు	5000	12000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00



పటిష్ఠ గస్తీతో నేరాలు కట్టడి

● ఎస్పీ వకుల్ జిందాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, ఫిబ్రవరి 20 : పటిష్ఠ గస్తీతో నేరాలు కట్టడి చేయగలమని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పగటిపూట గస్తీ నిర్వహించే పోలీసు సిబ్బంది బ్యాంక్‌లు, ఏటీఎంలు, నిర్మానుష్యమైన ప్రదేశాలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, రద్దీప్రదేశాలలో గస్తీ నిర్వహించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టే సమయంలో గస్తీ నిర్వహిస్తూ ఆకతాయిల ఆగడాలను కట్టడి చేయాలన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందుపరిచిన ఈబీట్స్‌యాప్ ఉపయోగిస్తూ రాత్రి గస్తీ నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించుట కట్టడి చేయాలన్నారు. సీసీ కెమెరాలు జిల్లా వ్యాప్తంగా గతంలో 700 ఏర్పాటు చేశామని వాటి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. రౌడీషీటర్స్, చెడునడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. రౌడీషీటర్లపై నమోదు కేసుల విచారణ వేగవంతం చేసి తగిన సాక్ష్యాధారాలతో సంబంధిత కోర్టులలో అభియోగపత్రం దాఖలు చేయాలన్నారు. పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోలు తరుచు తమ పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ ఉండాలన్నారు. కోడిపందాలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేయాలన్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గత ఎన్నికలలో జరిగిన నేరాలను సమీక్షించి ఈసారి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిస్సింగ్ కేసులను సీరియస్‌గా తీసుకొని ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు వేగం చేయాలన్నారు. పోక్సో కేసులలో పోలీసు అధికారులు దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, సాంకేతిక నైపుణ్యం, ప్రాసిక్యూషన్ విచారణపై ప్రత్యేక శ్రద్ధ కనపరచి కేసులను నిరంతరం పర్యవేక్షించి ముద్దాయిలకు శిక్షపడేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల దర్యాప్తులో, ముద్దాయిల అరెస్టులో, పెండింగ్ కేసులు తగ్గించటంలో, నిందితులకు జైలుశిక్ష పడేవిధంగా సమర్ధవంతంగా కోర్టు ట్రైల్ మానిటరింగ్ నిర్వహించటంలో ఉత్తమ ప్రతిభకనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డీఎస్పీలు టి.వెంకటేశులు, ఎస్.ప్రసాదరావు, టి.మురళీకృష్ణష్ణ, ఏఆర్‌డిఎస్‌పి ఎస్.చంద్రమోహన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.మల్లికార్జునరావు, ఎలక్షన్‌సెల్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.మురళీకృష్ణ, జిల్లాలోని ఇతర సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడితో భయపెట్టలేరు : కొల్లా

బాపట్లటౌన్, ఫిబ్రవరి 20 : దాడులతో భయపెట్టి దారికి తెచ్చుకోవాలనుకోవటం సరికాదని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు ముఖ్యమంత్రి బహిరంగ సభలో విచక్షణ రహితంగా గాయపర్చటం దారుణమన్నారు. సమాజంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేసే మీడియాపై దాడులకు తెగపడిన నైజం ముఖ్యమంత్రి జగన్ శాడిజాన్ని రుజువు చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్‌ను చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. అరాచక మూకలు చెలరేగిపోతుంటే అడ్డుకోవాల్సిన వైసీపీనేతలు మరింతగా కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు పురిగొల్పటం మీడియాపై వైసీపీ కక్ష సాధింపునకు నిదర్శనమని కొల్లా అన్నారు.

ప్రతి ఒక్కరు సమాన హక్కులు కలిగి ఉండవచ్చు

బాపట్ల, ఫిబ్రవరి 20 : ప్రతి ఒక్కరు సమానమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కులను కలిగి ఉండటంతోపాటు అవకాశాలు పొందవచ్చని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి అన్నారు. బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్‌డే ఆఫ్ సోషల్ జస్టిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి వాణి అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ అధికారిక ఉపాధి ద్వారా సామాజిక న్యాయాన్ని పొందవచ్చన్నారు. న్యాయవాదులు ఊట్ల రామారావు, సీహెచ్ రామాంజనేయులు, సీడీపీవో బి.శైలజ, ఏసీడీపీవో లక్ష్మీపార్వతి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

బైక్ ఢీకొని భార్యభర్తలకు గాయాలు

బాపట్ల, ఫిబ్రవరి 20 : బైక్‌పై బాపట్ల వస్తున్న భార్య భర్తలను ఎదురొచ్చిన బైక్ ఢీకొట్టటంతో ఇరువురికి గాయాలైన సంఘటన జీబీసీ రోడ్డులోని ఆర్‌వోబి పై జరిగింది. పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపిన వివరాలు ప్రకారం మంచాల గ్రామానికి చెందిన చందు నరసింహారావు, వెంకటసత్యవతి దంపతులు మంగళవారం ఆయన అక్క ఇంటికి బైక్‌పై బాపట్ల వస్తుండగా ఆర్‌వోబిపై బైక్‌పై వెళుతున్న వ్యక్తి లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురొస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో భార్యభర్తలతోపాటు ఢీకొట్టిన వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమే

● జగన్‌ను గద్దె దించేందుకు సిద్ధం కావాలి

● ఎమ్మెల్యే అనగాని సోదరుడు శివప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 20 : రానున్న ఎన్నికల్లో జగన్‌ను గద్దెదించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా సిద్ధం కావాలని ఎమ్మెల్యే అనగాని సోదరుడు శివప్రసాద్ అన్నారు. అరవపల్లి బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో టీడీపీ పార్టీ అధికారంలోకి రావాలని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చిన్నఅరవపల్లి, పెద్ద అరవపల్లి, గ్రామాల్లో బాబూ షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ టీడీపీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు బతికే పరిస్థితి లేదని, తీరప్రాంతంలో ఒక్క రోడ్డుపైనా పార మట్టి వేసిన దాఖలాలు లేవన్నారు. అభివృద్ధి చేయకపోగా ఇసుక, మట్టి, మాఫియాలకు అడ్డాగా చేశారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల 9 నెలల పాలనలో విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, నిత్యవసర ధరలు, పెట్రోల్, డీజీల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ఈభారం పేద ప్రజలపై పడటంతో వారి జీవన విధానం ఇబ్బందులు పడే విధంగా తయారైందన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, బాపట్ల పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి తాతా ఏడుకొండలు, తెలుగు యువత అధ్యక్షులు కొలసాని రాము, టీడీపీ నాయకులు వేజళ్ళ పూర్ణానందం, వడ్డి లక్ష్మోజీ, మోర్ల అంజయ్య రేపల్లె సురేష్, బొందలపాటి నాగమల్లికార్జున్ రావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, పడమటి బాబూరావు, శ్యామ్‌బాబు, ఎల్.మల్లి, కొనగళ్ళ సుబ్బారావు, కేసన సురేంద్ర, వేపూరి గోపి, భూపతి అంజనేయులు, భూపతి శ్రీరామయ్య, నెల్లూరు రెడ్డియ్య పాల్గొన్నారు.



టీడీపీ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న శిక్షకులు షేక్ మహబూబ్ సుభానీ, వి.శ్రీనివాసరావు, ఉయ్యూరి వెంకటేశ్వరరావు

ముగిసిన స్కూల్ కాంప్లెక్స్ స్థాయి శిక్షణ తరగతులు

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 20 : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ రెండురోజుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి షేక్ మహబూబ్ సుభానీ, వి.శ్రీనివాసరావులు శిక్షకులుగా వ్యవహరించారు. మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయులకు విద్యాపరంగా పలు అంశాలు గురించి వివరించారు. పిట్టలవానిపాలెం మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.మాధవరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సివిల్ సప్లైలో హమాలీలకు పని భద్రత కల్పించాలి

● సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

బాపట్లటౌన్, ఫిబ్రవరి 20 : సివిల్ సప్లైలో హమాలీలకు పని భద్రత కల్పించాలని సివిల్ సప్లైస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన అంజనేయులు అన్నారు. బాపట్ల పాతబస్టాండ్‌లో సివిల్ సప్లై గూడెం వరకు సీపీఐ, ఏఐటీయూసీ, సివిల్ సప్లై హమాలీలు కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ సప్లైస్‌లోని పదవీ విరమణ పొందిన కార్మికులకు రాష్ట్రప్రభుత్వం ఇప్పటి వరకు పీఎఫ్‌లు అందజేయలేదని దసరాకు ఇచ్చే బోనస్ కూడా రెండు సంవత్సరాలు నుంచి రావటంలేదన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా 772 వైద్యశాలల్లో వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసిందని, కార్మికులకు ఈఎస్‌ఐ సదుపాయం ఉన్నప్పటికి వైద్యసేవలు సక్రమంగా అందటంలేదన్నారు. సీపీఐ నాయకులు జెబి.శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రథమ మహాసభలు జరుగుతున్న తరుణంలో నూతనకమిటీని ఏర్పాటు చేసుకొని కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. సివిల్ సప్లైస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజిబాబు, ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్, కె.రవిబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వచన కవితల పోటీల విజేతలు వీరే

బాపట్ల, ఫిబ్రవరి 20 : బాపట్ల జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృబాషాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి వచన కవితల పోటీలలో విజేతలను మంగళవారం అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్, కార్యదర్శి నందిరాజు విజయ్‌కుమార్ ప్రకటించారు. ప్రథమ బహుమతిని జి.రామచంద్రరావు(చెరుకుపల్లి), ద్వితీయ బహుమతి చుండూరు శేషమాంబ (గుంటూరు) గెలుచుకోగా తృతీయ బహుమతులను హైమావతి సత్య (తణుకు) చెన్నాప్రగడశర్మ (విజయవాడ) పొందినట్లు వివరించారు. కె.రాజ్‌కుమార్ (నిర్మల), నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి (కొలకలూరు) ప్రత్యేక బహుమతులు పొందారు. లీలా కృష్ణ (తెనాలి), లేదాళ్ళ రాజేశ్వరరావు (లక్ష్మిశెట్టిపేట) ప్రోత్సాహక బహుమతులు పొందినట్లు వివరించారు. బహుమతులను బుధవారం బాపట్ల రోటరీ కళ్యాణ మండపంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో బహూకరిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి డాక్టర్ భీరం సుందరరావు, వర్తమాన సినీకవి దవళేశ్వరపు జగదీష్‌లు మాతృబాష ఔన్నత్యంపై ప్రసంగిస్తారన్నారు. ప్రముఖ కవులైన డాక్టర్ నారాయణశేషుబాబు, అబ్దుల్ హఫీజ్, వంగర శ్రీధర్‌లకు పెనుమెత్స నాగరాజు సాహిత్య పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఎయిమ్ ఫర్ సేవ సంస్థ బాలలతో వంకర టింకర షో అనే సందేశాత్మక హాస్య నాటిక ప్రదర్శించబడుతుందన్నారు.

గుజ్జర్లపూడి ఏసోబుకు ఘన నివాళి

బాపట్ల, ఫిబ్రవరి 20 : మండలంలోని నరసాయపాలెం గ్రామానికి చెందిన సీనియర్ కమ్యూనిస్ట్ నాయకుడు గుజ్జర్లపూడి ఏసోబు (102) మంగళవారం మృతి చెందారు. అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.చార్వాకకు ఏసోబు తాతా కావటంతో పలువురు ప్రముఖులు భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు. తన తాతను స్ఫూర్తిగా తీసుకొని తాను ఉద్యమ బాటలో పయనించినట్లు చార్వాక తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ రాజేష్, మేకా శ్యామప్రసాద్, దాసరి లక్ష్మీ, శీలం లింకన్, దండమూడి కిషోర్, చెల్లి అశోక్ తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

బాపట్ల, ఫిబ్రవరి 20 :పట్టణంలోని త్యాగరాయనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీనివాస సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో మూలమంత్ర హోమం, అభిషేకం, గోపూజ, 35 మంది దంపతులతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యాజ్ఞిక స్వామి పరాశరం రామాచార్యులు, దివిపవన్‌కుమార్‌లు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త శ్రీనివాస సంపత్‌కుమార్ పర్యవేక్షించగా భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడికి తీవ్ర గాయాలు

వేమూరు, ఫిబ్రవరి 20 : గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని జంపని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గరికబాబు చదలవాడ నుంచి ద్విచక్ర వాహనంపై జంపని గ్రామానికి వస్తున్నాడు. షుగర్ ఫ్యాక్టరీ సమీపానికి వచ్చే సరికి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో కిందకు పడిపోయిన బాబు మెదడుకు తీవ్రంగా గాయమైంది. అదే సందర్భంలో తెనాలి నుండి వస్తున్న 108 వాహనం సిబ్బంది క్షతగాత్రుడైన బాబును తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెదడుకు తీవ్ర గాయం కావటంతో పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రత్యేక చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వేమూరు పోలీసులు ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

కొల్లూరు, ఫిబ్రవరి 20 : పోలింగ్ కేంద్రాలను మంగళవారం జడ్పీ సీఈవో వసంతరాయుడు పరిశీలించారు. మండల పరిధిలోని అనంతవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిలుమూరు, రావికంపాడులోని ప్రాథమిక పాఠశాలలు, ఈపూరులోని ప్రాథమికోన్నత పాఠశాలల్లోని పోలింగ్ బూత్‌లను సీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతుల గురించి ఆరా తీశారు. ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని భద్రపరిచేందుకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో లక్ష్మీకుమారి, ఎంఈవో-2 జ్యోతి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో వసంతరాయుడు

వైసీపీ పాలనను సాగనంపాలి : తాతా ఏడుకొండలు

చెరుకుపల్లి, ఫిబ్రవరి 20 : వైసీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలపై దాడులు జరుగుతున్నాయని బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాతా ఏడుకొండలు అన్నారు. మంగళవారం రాజవోలు గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రాన్ని వైసీపీ పాలకులు అప్పులలోకి నెట్టి వేశారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తేవటంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలు జరగనున్న ఎన్నికలలో టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మొహమాటం రాధాకృష్ణమూర్తి, వుయ్యూరు శివ, గ్రామ పార్టీ అధ్యక్షులు బట్టు స్వామి, మాజీ సర్పంచ్ తుళ్ళూరి శివ వెంకట రామారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు దూళ్ళ సురేష్, టీడీపీ, జనసేన నాయకులు రాంబాబు, పిట్టు శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరరావు, సీతయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదవారిని లక్షాధికారులుగా చేయటమే ఎజెండా

● విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ శివభాగ్యరావు

బాపట్ల, ఫిబ్రవరి 20 : నిరుద్యోగ వ్యవస్థను రూపుమాపి ప్రతి పేద కుటుంబాన్ని లక్షాధికారులుగా చేయటమే తమ ఎజెండా అని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి, ఆల్ తెలుగు ప్రజాపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కటికల శివభాగ్యరావు స్పష్టం చేశారు. పట్టణంలోని పటేల్‌నగర్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శివభాగ్యారావు మాట్లాడుతు రైతులు, చేతివృత్తులవారు తయారు చేసిన ప్రొడక్ట్‌లను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చూస్తామని చెప్పారు. డిగ్రీ చదివిన ప్రతి ఒక్కరికి అవకాశం కల్పిస్తానన్నారు. విదేశాలకు వెళ్ళాలనుకునేవారికి ప్రభుత్వమే పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులయ్యేలా చేసి విదేశాలకు వెళ్ళి ఉద్యోగాలు చేసుకునేలా చేస్తామన్నారు. ఈవిధంగా ప్రతి కుటుంబానికి మేలు జరిగే అజెండాతో సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమౌతున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో జంగా నాగేశ్వరరావు, కటికల మోషె తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 20 : భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఐలవరంలో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా సమన్వయ కర్త యల్లాప్రగడ సీతాపతి భీష్మ ఏకాదశి పర్వదినం ఆవశ్యకతను భక్తులకు తెలియజేశారు. భీష్ముడు విష్ణు సహస్రనామాన్ని లోకానికి అందించిన రోజున భీష్మ ఏకాదశిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని, ప్రతి ఒక్కరికి భీష్మ ఏకాదశి రోజున విష్ణు సహస్రనామ పారాయణం చేయడం వలన సకల శుభాలు కలుగుతాయని ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జంపనిలో...

వేమూరు, ఫిబ్రవరి 20 : భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో మంగళవారం వార్షిక ఉత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామికి విశేష అర్చన జరిపి సహస్ర అష్టోత్తర శతనామాలతో తులసి దళా అర్చన నిర్వహించారు. స్వామిని విశేషంగా అలంకరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు భజన మండలి సభ్యులు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ నిర్వహించారు. భీష్మ ఏకాదశి విశిష్టతను పండిత ఎం.శ్రీనివాసమూర్తి భక్తులకు వివరించారు. శ్రీ భూ సహిత శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఉత్సవమూర్తులతో ఆలయ ఉత్సవం జరిపారు. మండలంలోని పలు గ్రామాలలో విష్ణు ఆలయాలలో, రామ మందిరాలలో భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా విశేష పూజలు, భజనలు నిర్వహించారు.

శ్రీ పోలేరమ్మతల్లి దేవాలయంలో...

బాపట్ల, ఫిబ్రవరి 20 : పట్టణంలోని జీబీసీ రోడ్డులో ఉన్న శ్రీపోలేరమ్మతల్లి దేవాలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షురాలు బండ్రెడ్డి రజనీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మణిదీపారాధన, విష్ణుసహస్ర పారాయణం, లలిత అష్టోత్తరం, హనుమాన్‌చాలీసాపఠనం చేశారు. అనంతరం ముత్తాయిదువులకు పండు, తాంబూలాలు అందించి తీర్థప్రసాదాలు వితరణ చేశారు. భీష్ముని గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో సభ్యులు బూర్లె రత్తయ్య, సింగారావు, మద్దుల వెంకటేశ్వర్లు, నటరాజన్, గృహలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సిద్ధిగణపతిస్వామి దేవస్థాన ధర్మకర్త శేషగిరిరావు మృతి



తాడికొండ శేషగిరిరావు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 20 : మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఉన్న శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధిగణపతిస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త తాడికొండ శేషగిరిరావు (92) సోమవారం రాత్రి మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్వగ్రామమైన వెల్లటూరులో బుధవారం శేషగిరిరావు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు చెప్పారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేస్తా

● బాపట్ల పార్లమెంటరీ కార్యనిర్వహక కార్యదర్శి ఏడుకొండలు

రేపల్లె, ఫిబ్రవరి 20 : టీడీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన బాపట్ల పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి తాతా ఏడుకొండలు అన్నారు. బాపట్లలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఏలూరు సాంబశివరావు పదవిని కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేసి రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని సోదరుడు అనగాని శివప్రసాద్, కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, మేకా రాజేష్‌కన్నా, కె.రాజారామ్, డాక్టర్ వేజళ్ళ పూర్ణానందం, గోగినేని పట్టాభిరామారావు, గుర్రం మురహరి, ఓగిబోయిన వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



తాతా ఏడుకొండలును అభినందిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్

చీకటి జీవోను రద్దు చేయాలి

● బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు

రేపల్లె, ఫిబ్రవరి 20 : ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని ప్రభుత్వం పునరాలోచించి ఉపసంహరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు అన్నారు. న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం 48వ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ చైతన్యవంతులై ఇటువంటి చట్టాల వలన జరిగే నష్టం గ్రహించి న్యాయవాదులు చేస్తున్నదీక్షకు చేయి కలిపి నడుంబిగించాలని ఆయన కోరారు. రాక్షస ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగు సంవత్సరాల కాలంలో ప్రజా వ్యతిరేక విధానాలను మాత్రమే తీసుకుంటుందని, ఇటువంటి ప్రభుత్వంపై ప్రజలందరూ ఐక్యంగా పోరాడి ఇంటికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆళ్ళ సూరిబాబు, పుప్పాల ఐజ్, కొలుసు రామారావు, గురిశెట్టి వెంకట సుబ్బయ్య, ఎంవీ సుబ్బారావు, కె.జగదీష్, వి.కృష్ణమోహన్‌రావు, కె.ప్రవీణ్, కొండలరావు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు

ఆడుదాం ఆంధ్ర పోటీలలో బాపట్లకు ఐదు బంగారు పతకాలు

● క్రీడాకారులను అభినందించిన కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 20 : ఆడుదాం ఆంధ్ర క్రీడలలో బాపట్ల జిల్లా కీర్తి రాష్ట్ర స్థాయిలో చిరస్థాయిగా నిలిచిపోయిందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. క్రీడా పోటీలలో రాష్ట్రస్థాయిలో నాలుగు క్రీడలలో ప్రథమ స్థానంలో నిలిచి 5 బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖోఖో క్రీడలలో జెపంగులూరు బాలుర జట్టు రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానంలో నిలిచి ఛాంపియన్‌షిప్ కప్ కైవశం చేసుకోగా కబడ్డీలో చినగంజాం బాలుర జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. వాలీబాల్ క్రీడలో బాపట్ల మండలం బేతపూడి బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలవగా అదే క్రీడలో నిజాంపట్నం బాలికల జట్టు ప్రథమస్థానం సొంతం చేసుకుందన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో చీరాల బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలిచి ఛాంపియన్‌షిప్ కప్, బంగారు పతకాలను పొందారన్నారు. క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బాపట్ల జిల్లా కీర్తిని మరింత ఇనుమడింప చేయాలన్నారు. బంగారు పతకాలు సాధించేలా కృషి చేసిన క్రీడాకారులు, డిఎస్‌డివో కె.పాల్‌కుమార్‌లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జాయింట్ కలెక్టర్ సి.హెచ్ శ్రీధర్ మాట్లాడుతూ పతకాల పంట తెచ్చిపెట్టిన క్రీడాకారులు మున్ముందు ఇదేస్ఫూర్తిని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె.పాల్‌కుమార్, కోచ్‌లు శైలజ, వెంకయ్య, పాల్, ఏపీ ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి విజేతలతో కలెక్టర్ పి.రంజిత్‌బాషా తదితరులు

నిరుపేదలకు అండగా ప్రభుత్వం : కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 20 : నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకం కింద వివాహం చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు త్రైమాసికం నగదు పంపిణీ కార్యక్రమాన్ని తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి మంగళవారం బటన్ నొక్కి ప్రారంభించగా బాపట్ల కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో లబ్ధిదారులకు వీక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 284 దంపతులకు రూ.2.40 కోట్లు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలలో జమ అయ్యిందని తెలిపారు. పేద సామాజికవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి జె.రాజదేబొరా, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

నంది అవార్డు అందుకున్న శ్రీనివాసరావు

వేమూరు, ఫిబ్రవరి 20 : ప్రముఖ పౌరాణిక నాటక కళాకారుడు, చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు నంది అవార్డు అందుకున్నారు. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ మహనీయుల అవార్డ్స్ 2024 కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి నిర్వహించారు. రెండు దశాబ్దాల కాలం నుంచి పౌరాణిక నాటక రంగంలో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ తనదైన శైలిలో సహజ నటన కనబరుస్తూ మంచి నటుడిగా గుర్తింపు పొందిన శ్రీనివాసరావు నంది అవార్డుతో ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నటుడు పృథ్వీరాజ్ చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. హరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రుడిగా, విశ్వామిత్రునిగా, బాలనాగమ్మ నాటకంలో బాలవర్ధినిగా, బ్రహ్మంగారి నాటకంలో సిద్దయ్యగా మరెన్నో నాటకాలలో అనేక పాత్రలను పోషించారు. అవార్డు అందుకున్న సందర్భంగా చావలి గ్రామస్తులు పలువురు కళాకారులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కొల్లూరు, ఫిబ్రవరి 20 : పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి చిలుమూరు ఉభయ రామేశ్వర క్షేత్రం సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

అద్దంకి, ఫిబ్రవరి 20: మండలంలోని వెంపరాల ఎస్సీ కాలనీలో జి.అంకమ్మరావు(32) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. అంకమ్మరావు బేల్దారి పనులకు వెళ్లి కుటుంబపోషణ సాగిస్తున్నాడు. ప్రస్తుతం భార్యాభర్తలు పచ్చాకు పనికి వెళ్తున్నారు. గత కొద్దిరోజులుగా అంకమ్మరావు పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నట్లు తెలుస్తుంది. ఈక్రమంలో మంగళవారం కుటుంబసభ్యులు ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే గమనించి 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపు మృతి చెందాడు. అంకమ్మరావుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు

యద్దనపూడి(మార్టూరు) ఫిబ్రవరి 20: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో శోభకృత్ భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు నారాయణ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఏకాదశ పర్యాయ పారాయణులు, అష్టాదశోధ్యాయ గీత పారాయణ కార్యక్రమాలతో పాటు ఏకాదశి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులతో భీష్మ పూజాదికాలు, గీతామాతా అర్చనలు జరిపించారు. తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్రానైట్ శ్లాబుల లారీ పట్టివేత

మార్టూరు, ఫిబ్రవరి 20: మార్టూరు సెంటరు నుంచి రాజుపాలెం వెళ్లే సర్వీసు రోడ్డులో సోమవారం అర్ధరాత్రి ఎలాంటి బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రానికి వెళుతున్న గ్రానైట్ శ్లాబుల లారీని పట్టుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మూడు రోజుల క్రితం రాజుగారిపాలెం రోడ్డు వద్ద కూడా మరో గ్రానైట్ శ్లాబుల లారీని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీటిని స్టేషన్‌కు తరలించిన అనంతరం మైనింగ్ అధికారులకు పట్టుబడిన లారీల విషయమై ఫిర్యాదు చేశామన్నారు.

437 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, ఫిబ్రవరి 20: మండలంలోని గొనసపూడి గ్రామంలో పోలేరమ్మ ఆలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.కీర్తిసరోజ్, బి.నాగేంద్ర, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ షేక్ అజీమ్ 437 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, మాధవి, వరదానం, శ్రీలక్ష్మి, సుధ, జి.విజయప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మనపాలెం రేషన్ డీలర్ తొలగింపు

మేదరమెట్ల, ఫిబ్రవరి 20: మండలంలోని తిమ్మనపాలెం రేషన్ డీలర్‌ను తొలగిస్తూ ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. తిమ్మనపాలెం రేషన్ డీలర్‌గా జి. లక్ష్మీకుమారి పనిచేస్తున్నారు. ఆమె 2021 పంచాయతీ ఎన్నికలల్లో తిమ్మనపాలెం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నవారు రేషన్ షాపు నిర్వహించడానికి వీలు లేదని పౌరసరఫరాల చట్టంలో స్పష్టంగా పెర్కొన్నారని గ్రామానికి చెందిన వారు పిర్యాదు చేయడంతో లక్ష్మీకుమారిని రేషన్ డీలర్‌గా తొలగిస్తు ఆర్‌డీవో సూర్యనారాయణరెడ్డి ఉత్వర్వులు జారీ చేశారు. తక్షణమే తగిన చర్యలు తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని కొరిశపాడు తహసీల్దార్‌ను ఆదేశించారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

మేదరమెట్ల, ఫిబ్రవరి 20: వచ్చేనెల మూడవ తేదిన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఎస్.విజయమ్మ ఆదేశించారు. మంగళవారం మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డెలివరీ రూం, ఐఎల్ఆర్, డీఫ్రీజర్‌లను ఆమె పరిశీలించారు. గర్భిణులకు అందించే సేవలలో ఎలాంటి అశ్రద్ధ వహించవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.చిట్టిబాబు, డాక్టర్ పి.నిఖిలా రెడ్డి, డాక్టర్ మనోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

'భవనాసి' చుట్టూ చేపల చెరువులు

- కలుషిత నీటిని చెరువులోకి వదులుతున్న నిర్వాహకులు
- దుర్వాసన వెదజల్లుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు


భవనాసి చెరువు అంచున ఉన్న చేపల చెరువులు

అద్దంకి, ఫిబ్రవరి 20: ఒకప్పుడు స్వచ్ఛంగా ఉండే భవనాసి చెరువు నీరు నేడు కలుషితంగా మారిపోయాయి. శింగరకొండ వద్ద ఉన్న భవనాసి చెరువుకు రెండు వైపులా పెద్ద సంఖ్యలో చేపల చెరువులు ఏర్పాటుచేశారు. చేపల చెరువుల విస్తీర్ణం ఏటికేడు పెరుగుతుంది. భవనాసి చెరువు నీటినే చేపల చెరువులకు నింపుకుంటున్న నిర్వాహకులు చేపల మేతగా వినియోగించే మాంసం వ్యర్థాలతో కలుషితమైన నీటిని భవనాసి చెరువులోకి వదులుతున్నారు. దీంతో భవనాసి చెరువు నీరు మొత్తం కలుషితంగా మారుతుంది. కలుషిత నీరే పంట పొలాలతో పాటు గుండ్లకమ్మ నదిలో ఉన్న మంచినీటి ఊటబావుల వరకు చేరుతున్నాయి. దీంతో అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాల ప్రజలకు ఆ ఊటబావుల నీరే సరఫరా అవుతుంది. కలుషిత నీటితో భవనాసి చెరువులో కూడా గతంలో ఎన్నడూ లేనివిధంగా నాచు పెరిగి, కుళ్ళిన తర్వాత మరింత దుర్వాసన వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అటు చేపల చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలకు తోడు నాచు కుళ్ళటం ద్వారా మరింత కలుషితమై భవనాసి చెరువులో చేపల ఎదుగుదలపై కూడా ప్రభావం చూపుతుందని జాలర్లు ఆందోళన చెందుతున్నారు.

భవనాసి చెరువుకు రెండువైపులా ఇష్టానుసారంగా చేపల చెరువుల తవ్వకాలు చేస్తున్నా, కొంతమేర భవనాసి చెరువు భూమి ఆక్రమించి చేపల చెరువుల ఏర్పాటు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవటం మరింత విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చేపల చెరువుల నుంచి కలుషిత నీరు భవనాసి చెరువు లోకి విడుదల చేయకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులుగా ప్రధాన రహదారులు

- వ్యర్థాలు, బండరాళ్లతో నిండిపోతున్న వైనం
- దుర్గంధంతో ప్రజల అవస్థలు
- పట్టనట్టుగా అధికారులు


పర్చూరు - చీరాల రహదారిలో వ్యర్థాలతో నిండిన రోడ్డు మార్జిన్

పర్చూరు, ఫిబ్రవరి 20: ఓపక్క దుర్గంధం, మరోవైపు ప్రమాద భరితంగా బండరాళ్ళు వ్యర్థాలతో ప్రధాన రహదారులు దర్శనమిస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, ప్రజలతో రాకపోకలు సాగించే ప్రధాన రోడ్ల మార్జిన్‌ల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీనికితోడు వ్యర్థాలతో చెత్తకుప్పలుగా మారటంతో సమస్య మరింత జఠిలంగా మారింది. చెత్తకుప్పల్లో నుంచి ఒక్కసారిగా జీవాలు రోడ్డుపైకి రావటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పర్చూరు - చీరాలకి వెళ్ళే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈమార్గంలో ఇటీవల పర్చూరు మండలం ఉప్పుటూరుకు చెందిన ఓవ్యక్తి ద్విచక్ర వాహనంపై పర్చూరు వస్తుండగా చెత్తకుప్పలుగా మారిన వ్యర్థాలలో నుంచి పందులు రోడ్డుపైకి రావటంతో ప్రమాదానికి గురై మృతిచెందాడు. ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయి. అదేవిధంగా ఇళ్ల వ్యర్థాలు, బండరాళ్ళు సైతం ప్రధాన రోడ్లకు ఇరువైపులా పోస్తున్నారు. దీంతో సమస్య మరింత ప్రమాదభరితంగా మారింది. ఒకవైపు రోడ్లు అధ్వానంగా మారటం, మరోవైపు మార్జిన్‌లు వర్థాలతో నిండిపోయి ఉండటంతో రోడ్డు మార్జిన్‌ల్లోకి వాహనం వెళితే ప్రమాదానికి గురికావల్సిందే. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ప్రమాదభరితంగా ఉంది. రోడ్డు మార్జిన్‌లు వ్యర్థాలతో నిండి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూస్తున్న దాఖలాలు కానరావటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌ల్లో వర్థాలను తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఉప్పుటూరు సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో పడవేసిన బండరాళ్ళు

పారిశుధ్యం పట్టదా..!

- అద్దంకి మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్‌ల ధ్వజం
- వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి
- మారిన అధికారపార్టీ కౌన్సిలర్‌ల తీరు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ


పారిశుధ్యం, తాగునీటి సమస్యపై ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్‌లు

అద్దంకి, ఫిబ్రవరి 20: అద్దంకి మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్‌లు పాత పంథానే కొనసాగించగా, అధికారపార్టీ కౌన్సిలర్‌లలో మాత్రం మార్పు కనిపించింది. గతంలో టీడీపీ కౌన్సిలర్‌లు సమావేశంలో ఏ చిన్నపాటి సమస్యను ప్రస్తావించినా అధికారపార్టీ వారు మూకుమ్మడిగా ఎదురుదాడికి దిగేవారు. మహిళా కౌన్సిలర్‌లు అని కూడా చూడకుండా రన్నింగ్ కామెంటరీ చేసిన సందర్భాలు కూడా చోటు చేసుకున్నాయి. అయితే, మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మాత్రం గతానికి భిన్నంగా జరిగింది. టీడీపీ కౌన్సిలర్‌లు పారిశుధ్యం, తాగునీటి ఎద్దడి గురించి ప్రస్తావించినా.. అధికారపార్టీ కౌన్సిలర్‌లలో ఒకరిద్దరు మాత్రమే మాట్లాడే ప్రయత్నం చేశారు. అత్యధిక శాతం అధికార పార్టీ కౌన్సిలర్‌లు మాత్రం ప్రజాసమస్యలను ఎలాగూ తాము ప్రస్తావించలేకపోతున్నాం, కనీసం టీడీపీ కౌన్సిలర్‌లు అయినా మాట్లాడితే బాగుండు అన్న విధంగా వ్యవహరించారు. దీనికితోడు త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటం కూడా కారణంగా తెలుస్తుంది. ఈక్రమంలో ఎందుకువచ్చిన తంటా మాట్లాడకుండా ఉండటం మేలన్న ధోరణితో ఉన్నట్లు తెలుస్తుంది. అధికారపార్టీ కౌన్సిలర్‌లలో మార్పు కనిపించటం టీడీపీ కౌన్సిలర్‌లను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది.

అద్దంకి పట్టణంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందని 6వ వార్డు కౌన్సిలర్ కంపా రజని ప్రశ్నించారు. మురుగు కాలువల పూడికతీత చేపట్టడం లేదని, ఫాగింగ్ చేయకపోవటంతో దోమల బెడద ఎక్కువైందని అన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని 4వ వార్డు కౌన్సిలర్ మాగులూరి తిరపతమ్మ కోరారు. దీనికి స్పందించిన చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, కమిషనర్ అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ త్వరలో ఫాగింగ్ చేపడతామన్నారు. నీటిఎద్దడి లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్‌చైర్మన్ దేసు పద్మేష్, కమిషనర్ అబ్దుల్ రషీద్, మేనేజర్ శ్రీదేవి, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల, ఫిబ్రవరి 20: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనమనమూరు గ్రామానికి చెందిన కొప్పోలు గోపి బైక్‌పై బైపాస్‌లోని పెట్రోల్ బంకులో ఆయిల్ పోయించుకుని బయటకు వచ్చాడు. అదే సమయంలో మరో బైకిస్టుకు ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు అద్దంకి విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 20: అద్దంకిలోని ఎన్‌టీఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పట్టణంలోని నంబూరివారిపాలెంకు చెందిన దినేష్ ఎన్‌టీఆర్ కళాశాలలో చదువుతూ ప్రకాశం జిల్లాలో జనవరి 30న జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీలో గెలుపొంది గోల్డ్‌మెడల్ సాధించడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 28 నుంచి మార్చి 5 వరకు పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొననున్నారు. ఈసందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ఎంఏ రత్తయ్య కరస్పాండెంట్ ఎంవీ రత్తయ్య, అధ్యాపకులు అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 20: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులకు, సిబ్బందికి ఎంపీడీవో రూతమ్మ సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో ఉన్న చిల్లచెట్లను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పంగులూరు, ఫిబ్రవరి 20: మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం బోల్తాపడిన ఘటనలో అలవలపాడు గ్రామానికి చెందిన యువకుడికి గాయాలయ్యాయి. మంగళవారం ద్విచక్ర వాహనంపై మార్టూరు వైపు వెళుతున్న దుడ్డు భాస్కర్, ముందు వెళుతున్న కారును క్రాస్‌చేసే ప్రయత్నం చేశాడు. కారు డ్రైవర్ సైడ్ ఇవ్వక పోవడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న భాస్కర్ అతి వేగంతో కారును ఛేజింగ్ చేసే ప్రయత్నంలో బైక్ బోల్తాపడి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో గాయపడిన భాస్కర్‌ను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మసకబారుతున్న 'మోటుపల్లి'

- ప్రాశస్త్యం కోల్పోతున్న వైనం
- గతం ఘనం.. వర్తమానం నామమాత్రం


ఒకప్పటి మోటుపల్లి ఓడరేవు

చీరాల, ఫిబ్రవరి 20: మోటుపల్లి ప్రాశస్త్యం మసకబారుతుంది. చినగంజాం మండలి పరిధిలోని మోటుపల్లి తీరప్రాంత గ్రామం. గతంలో ఇక్కడ ఓడరేవు ప్రసిద్ధిగాంచింది. ఆ ఆనవాళ్లన్నీ కోల్పోయింది. ప్రస్తుతం ఆనాటి ఓడరేవు ప్రాంతం కేవలం పడవలను నిలిపే ప్రదేశంగా మాత్రమే కనిపిస్తుంది.

మోటుపల్లి ఒకప్పటి మోహనగిరిపట్నం. ఇక్కడి ఓడరేవు చరిత్రాత్మకం. ఇక్కడ నుంచి వజ్ర, వైఢూర్యాలు, వస్త్రాలు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యేవి. 11వ శతాబ్దంలో చోళులు మోటుపల్లి ప్రాంతం నుంచి ప్రాంతం నుంచి పాలన సాగించారు. వారి పాలనలో ప్రస్తుతం మోటుపల్లి ప్రాంతానికి మోహనగిరిపట్నంగా పేరుంది. అప్పట్లో మోటుపల్లి ప్రాంతంలోని సముద్రతీరం వాణిజ్యకేంద్రంగా విరాజిల్లింది. చోళులు తరువాత రెడ్డి రాజులు, పల్లవులు, కాకతీయులు ఈప్రాంతాన్ని పాలించారు. కాకతీయుల కాలంలో మోటుపల్లి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. మోటుపల్లిలోని వీరభద్రస్వామి ఆలయం గర్భగుడి చోళుల కాలంలో జరిగితే కాకతీయుల కాలంలో విస్తరణ జరిగింది. ఆ కాలంలోనే బౌద్ధమతవ్యాప్తి కూడా ఆ ప్రాంతంలో జరిగిందని చారిత్రిక ఆధారాలు చెప్తున్నాయి.


ఆలయ ప్రాంగణంలో నందీశ్వరుడులేని శివలింగం

పురావస్తుశాఖ పర్యవేక్షణలో వీరభద్రస్వామి ఆలయం

మోటుపల్లిలోని వీరభద్రస్వామి ఆలయం పురావస్తుశాఖ పర్యవేక్షణలో ఉంది. మూలవిరాట్ గుప్తనిధుల కోసం అన్వేషించే దొంగల పాలయింది. మూలవిరాట్‌కు ఎదురుగా మండపంలో ఉండే నందీశ్వరుని విగ్రహాన్ని కూడా కొందరు పెకలించారు. దీంతో ఆ విగ్రహాన్ని ఆలయంలో భద్రపరిచారు. ప్రస్తుతం ఆలయం పురావస్తుశాఖ ఆధీనంలో ఉండటంతో పూజలు, దీపధూప నైవేద్యాలు కొరవడ్డాయి. కేవలం చారిత్రక స్థలంగా మాత్రమే మిగిలింది. ఎవరన్నా పర్యాటకులు సందర్శనకు వచ్చినపుడు మాత్రమే అక్కడ అలికిడి ఉంటుంది. లేదంటే తలుపులకు తాళాలు వేసి ఉంటున్నాయి.

పాలకులు పట్టించుకుంటేనే పూర్వవైభవం

మోటుపల్లి ప్రత్యేకతలు అనేకం. అక్కడ అప్పట్లో బౌద్ధమతం వ్యాప్తి కూడా జరిగిందని చెప్తుంటారు. వీరభద్రస్వామి ఆలయానికి సమీపంలో దెబ్బతిన్న భారీ బుద్ధ విగ్రహం అందుకు నిదర్శనం. చినగంజాం-ఉప్పుగుంటూరు జాతీయ రహదారి సమీపంలో బకింగ్‌హామ్ కెనాల్ పక్కన ఉన్న బౌద్ధ ఆరామక్షేత్రం కూడా ఆనాటి ఆనవాళ్లలో భాగమని ఆ ప్రాంతవాసులు భావిస్తుంటారు. ఈనేపథ్యంలో పాలకులు, అధికారులు స్పందించి మోటుపల్లి ఓడరేవు, వీరభద్రస్వామి ఆలయం, బౌద్ధ ఆరామ క్షేత్రానికి పూర్వ వైభవం తేవాలని ప్రజలు కోరుతున్నారు. అందుకు అనుగుణంగా పాలకులు, అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

ఐఎల్‌టీడీ గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ ఘనవిజయం


విజయోత్సాహంలో సీఐటీయూ ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 20: చీరాల ఐఎల్‌టీడీ ప్రాంగణంలో మంగళవారం జరిగిన గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ ఘనవిజయం సాధించింది. కంపెనీలో చీరాల పరిధిలో 1546, రాజమండ్రిలో 37, అనపర్తిలో 470 ఓట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 338 ఓట్ల ఆధిక్యంతో సీఐటీయూ గుర్తింపు సాధించింది. విజయానందంతో ప్రతినిధులు బాణసంచాతో ర్యాలీ నిర్వహించారు.

జడ్పీ పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 20: జిల్లాలోని జడ్పీ పరిధిలోని ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవీ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు కోరారు. ఈమేరకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. టీచర్ల పీఎఫ్ ఖాతాల్లో పెండింగ్‌లు లేకుండా సంబంధిత డీడీవోల నుంచి షెడ్యూల్స్‌ను తెప్పించి మిస్సింగులు లేకుండా చూడాలన్నారు. సీఎఫ్ఎంఎస్‌కు వీలైనంత త్వరగా అప్‌డేట్ చేసిన ఖాతాలకు సంబంధించిన సమాచారం పంపాలని వారు కోరారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

బల్లికురవ, ఫిబ్రవరి 20: పదో తరగతి పరీక్షలు ముగిసేవరకు విద్యార్థులకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందజేస్తామని పాఠశాల స్థలదాత కొణిదెన వెంకటసుబ్బారావు తెలిపారు. మంగళవారం మండలంలోని కొణిదెన యజ్ఞన్నారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠశాల స్థలదాత అయిన వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించే సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అల్పాహారాన్ని అందజేసేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియెగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కొణిదెనలో నవగ్రహాల ప్రతిష్ఠ


కొణిదెనలో నవగ్రహాల ప్రతిష్ఠకు సిద్ధం చేస్తున్న భక్తులు

బల్లికురవ, ఫిబ్రవరి 20: మండలంలోని కొణిదెనలో గల బ్రహ్మగుండం వద్ద బుధవారం నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమంలో భాగంగా రెండురోజుల నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నవగ్రహాల విగ్రహాలను తీసుకువచ్చి ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నారు. వేద పండితులచే ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచే నవగ్రహాలను జలాదివాసం నిర్వహించారు. అలాగే, బ్రహ్మగుండం వద్ద ఉన్న వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి 5 వార్షిక కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

సెయింట్ ఆన్స్ అధ్యాపకునికి జాతీయస్థాయి అవార్డు


అవార్డు సాధించిన అధ్యాపకుడిని అభినందిస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాల, ఫిబ్రవరి 20: సెయింట్ ఆన్స్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ టి.గోపాలరావు జాతీయస్థాయి అవార్డు సాధించారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు గోపాలరావును అభినందిచారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల ప్రతిష్ఠను ఇనుమడింపజేసే విధంగా గోపాలరావు ముందడుగు వేయటం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాధిపతి డాక్టర్ సీహెచ్ లక్ష్మీతులసి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ క్రయ విక్రయాలు నేరం

చీరాలటౌన్, ఫిబ్రవరి 20: మద్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, క్రయ విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలోని పాపాయిపాలెంలోని ఓ ఇంట్లో అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేఖ కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై వెంట కానిస్టేబుళ్లు రమేష్, కృపా తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, ఫిబ్రవరి 20: చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి సుధ పేర్కొన్నారు. సామాజిక న్యాయదినోత్సవం సందర్భంగా పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలోన్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయాధికారి బాలికలకు గుడ్‌టచ్ - బ్యాడ్‌టచ్, ఫోక్సో యాక్టు, బాలకార్మిక నిరోధకచట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, న్యాయవాదులు ఈశ్వరిరెడ్డి, సురేష్, పీఎల్వీ, ఎస్డీ మతీన్, హాస్టల్ వార్డెన్‌లు విజయలక్ష్మి, కోటేశ్వరమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు యద్దనపూడికి కలెక్టర్ రాక

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 20: స్థానిక జడ్పీ హైస్కూల్లో బుధవారం మధ్యాహ్నం జరగనున్న జగనన్నకు చెబుతాం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా పాల్గొంటారని ఎంపీడీవో శివసుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు కూడా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే రవికుమార్ పర్యటన వివరాలు

అద్దంకి, ఫిబ్రవరి 20: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బుధవారం పలు గ్రామాలలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు కామేపల్లి, 10.30కి పాతమాగులూరు, 11 గంటలకు అంబడిపూడి, 12 గంటలకు నాగులుప్పలపాడు మండలం పోతవరం, ఒంటి గంటకు ధైవాలరావూరులో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశం

అద్దంకి, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరుగుతుందని నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ కోరే సురేంద్రనాథ్ తెలిపారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 20: ప్రాణాంతక వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శోభారాణి, సెర్ప్ సంస్థ పీసీవో కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో ఐటీసీ బంగారు భవిష్యత్తు, సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. తడి, పొడి చెత్తపై సిబ్బంది ప్రజలకు వివరించాలన్నారు. వ్యర్థాలతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. చెత్తను తగులబెట్టడం వల్ల రోగాలు వ్యాపిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో దారా హనుమంతరావు, నారాయణ. నాగరాజు, అరుణ్, సతీష్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 20: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు జి.నివేదిత, జి.ప్రసన్న ఎంపికయ్యారు. గత ఆదివారం చినగంజాంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచి ఈనెల 21 నుంచి 23 వరకు సత్తెనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది వీరిని ప్రత్యేకంగా అభినందించారు.